thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 91 | జగిత్యాల | ఆదివారం | 28 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

400 అక్రమ వెబ్ సైట్లు సీజ్



11



## నాలుగు తరాల భూ వివాదానికి స్వస్తి

- సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు

సుదీర్ఘంగా నాలుగు తరాలుగా నడుస్తున్న ఒక సంక్లిష్ట భూ వివాదానికి సుప్రీం కోర్టు తాజాగా చెక్ పెట్టింది. ఆ భూమికి సంబంధించి 1957లో జరిగిన సేల్ డీడ్ (క్రయ విక్రయ పత్రం) పూర్తిగా చట్టబద్ధమైనదేనంటూ తీర్పును వెలువరించింది.

4



## 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా

4

## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ



ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది.

4





## గ్రామాలకు రాకపోకలు నిలవొద్దు

నిత్యావసరాలు, వైద్య సేవలకు ఆటంకం కలగొద్దు

గోదావరి వరదలతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో గోదావరి వరదల ముందస్తు ప్రణాళికపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు.

- గతానుభవాలతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
- పుష్కరాలకు గోదావరి తీరం సుందరీకరణ
- భద్రాచలం, పినపాకలో ప్రత్యేక ఏర్పాట్లు
- పుష్కరాలకు తీరం పరిశుభ్రంగా ఉంచాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- గోదావరి వరదలపై భద్రాద్రి కొత్తగూడెంలో ఉన్నతస్థాయి సమీక్ష

వివరాలు 2లో..

## ప్రపంచం చూపు.. తెలంగాణ వైపు



- 'తెలంగాణ రైజింగ్' తో దేశ, విదేశీ సంస్థల ఆకర్షణ
- నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు బహుళజాతి కొలువులు
- యాపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది యువతులకు ఛాన్స్
- సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ హర్షం

నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విధానం ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## ఎస్ఆర్ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోండి

- ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు
- కాంగ్రెస్ పాలనలో కుంభకోణాల జాతర
- మహేశ్వరం సభలో కేటీఆర్ దిశానిర్దేశం



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలి.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి అన్నదే ఇప్పుడు తెలంగాణ నలుదిశలా వినిపిస్తున్న నినాదమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎస్ఆర్ కార్యక్రమాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్ గా తీసుకుని, అర్హులైన ఓటర్ల పేర్లు గల్లంతు కాకుండా కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 3లో..

## కూల్చడంలో హిట్లర్.. నీళ్లలో నీరో

- 3 రాష్ట్రాల సీఎంల రహస్య ఒప్పందాలు
- మేడిగడ్డ వదిలి.. తుంగభద్రకు మరమ్మతులా?
- ఏపీ ప్రాజెక్టులపై ఎందుకు నోరుమెదపరు?
- రేవంత్ తీరుపై హరీశ్ రావు ఎద్దేవా



3



## వానొచ్చె.. జాగ్రత్త!

- రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు
- వచ్చే 7 రోజుల పాటు విస్తారంగా వర్షాలు
- జూలై 2 వరకు తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్
- ఖమ్మం, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- హైదరాబాద్‌లో రాత్రి పూట భారీ వర్షం

3



## గోల్డ్ మ్యాన్ అరెస్ట్!

పారిపోతుండగా పట్టుకున్న ఖాకీలు

30 లక్షల కుచ్చుటోపీ

2

## సినిమా స్టైల్లో గంజాయి రవాణా!

- పైలట్ వాహనం, ఇంటర్నెట్ కాల్స్ తో స్మగ్లర్ల ప్లాన్
- భారీ గ్యాంగ్ ను పట్టుకున్న పోలీసులు



వివరాలు 2లో..



## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

లంచం తీసుకుంటుండగా పట్టివేత

2

## రోహింగ్యాలను పంపించేయాలి!

- పాక్, బంగ్లా చొరబాటుదారులకు ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు

హైదరాబాద్ లో పరిస్థితిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆందోళన

3





2

## నేడే పల్స్ పోలియో!

5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరి..

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన సర్కారు

బూత్‌లు, ఇంటింటికి వెళ్లి పంపిణీ..

వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



# 'గోల్డ్ మ్యాన్' అరెస్ట్!

**పారిపోతుండగా పట్టుకున్న ఖాకీలు**

**30 లక్షలు వసూలు చేసి కుచ్చుటోపీ**

**హైదరాబాద్, జూన్ 27 :** తక్కువ ధరకు విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకులకు వల వేసి, లక్షలు దండుకున్న 'గోల్డ్ మ్యాన్' సూర్యభాయ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. పోలీసుల కళ్లుగప్పి హైదరాబాద్ నుంచి పారిపోతుండగా షాద్‌నగర్ వద్ద ఖాకీలు అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. విదేశీ బంగారం ఆశ చూపి సూర్యభాయ్ భారీ మోసానికి తెరతీశాడు. అతడి మాటలు నమ్మిన హిమాయత్‌నగర్, నీలోఫర్ ప్రాంతాలకు చెందిన బాధితులు సుమారు 30 లక్షల రూపాయలు సమర్పించుకున్నారు. రోజులు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు అతడి ఇంటికి వెళ్లి తమ డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని నిలదీశారు. దీంతో తన వద్ద ఉన్న 3 సెల్ ఫోన్లను ఇచ్చి వాటి విలువ 10 లక్షలు అని నమ్మించాడు. మిగతా మొత్తానికి 20 లక్షల చెక్కు చేతిలో పెట్టి వారిని పంపించేశాడు. ఆ తర్వాత సూర్యభాయ్ బాధితుల పైనే రివర్స్ డ్రామా ఆడాడు. బాధితులు తనను బెదిరించి సెల్ ఫోన్లు లాక్కున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజాలు రాబట్టారు. తక్కువ ధరకు బంగారం పేరిట సూర్యభాయ్ చేసిన మోసాన్ని నిర్ధారించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడ స్టేషన్‌కు బదిలీ చేశారు. అరెస్ట్ భయంతో హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు యత్నించగా షాద్‌నగర్ వద్ద సూర్యభాయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# సినిమా స్టైల్లో గంజాయి రవాణా!

**భారీ గ్యాంగ్ ను పట్టుకున్న పోలీసులు**

**పైలట్ వాహనం, ఇంటర్నెట్ కాల్స్ తో స్మగ్లర్ల ప్లాన్**



**56 లక్షల విలువైన 110 కిలోల సరుకు సీజ్**

**ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలింపు**

**నలుగురు అరెస్ట్.. పరారీలో ప్రధాన సూత్రధారి**

**హైదరాబాద్, జూన్ 27 ::** హైదరాబాద్ నగర శివార్లలో భారీ అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా పోలీసులకు చిక్కింది. సినిమా స్టైల్లో పైలట్ వాహనాన్ని పెట్టుకుని, నకిలీ నంబర్ ప్లేట్లు, ఇంటర్నెట్ కాల్స్ వాడుతూ గంజాయి రవాణా చేస్తున్న నలుగురు కేటుగాళ్లను శంషాబాద్ టాస్క్ ఫోర్స్, ఆదిభట్ల పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 56 లక్షల రూపాయల విలువైన 110 కిలోల గంజాయిని, 2 కార్లు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ముఠా ఒడిశా రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా గంజాయిని అక్రమంగా తరలిస్తోంది. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు వీరు ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేశారు. ఇందుకోసం టాటా హారియర్, మారుతి ఎర్టిగా లాంటి లగ్జరీ వాహనాలను వినియోగించారు. ఒక వాహనాన్ని 'పైలట్' వాహనంగా ముందు పంపిస్తూ.. మార్గమధ్యంలో ఎక్కడైనా పోలీసుల తనిఖీలు ఉన్నాయా అనే సమాచారాన్ని వెనుక గంజాయితో వస్తున్న వాహనానికి అందిస్తూ ఎస్కార్ట్ గా వ్యవహరించారు. టోల్ గేట్ల వద్ద పోలీసుల కళ్లుగప్పేందుకు వాహనాలకు నకిలీ మహారాష్ట్ర నంబర్ ప్లేట్లను ఉపయోగించారు. ఫోన్ కాల్స్ చేస్తే పోలీసులు ట్యాప్ చేస్తారనే భయంతో, ఒకరికొకరు సమాచారం ఇచ్చుకోవడానికి కేవలం ఇంటర్నెట్ కాలింగ్ యాప్స్ మాత్రమే వాడుతూ నిఘా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఔటర్ రింగ్ రోడ్డు గేట్ సమీపంలో ఈ రెండు వాహనాలను అడ్డగించి గంజాయిని పట్టుకున్నారు. స్మగ్లర్లు ఒడిశాలోని బెలహంపూర్ కు చెందిన సరఫరాదారుడు ప్రభిత్ర ప్రధాన్ నుంచి కేవలం 4 వేల రూపాయలకే కిలో గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ గంజాయిని మహారాష్ట్రకు తరలించి అక్కడ కిలో 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు అమ్ముతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠాలో కీలకమైన ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి

**భువనగిరి, జూన్ 27:** యాదాద్రి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో విషాదం చోటు చేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. పెద్ద కుమారుడిని దింపేందుకు తల్లి స్కూల్ బస్సు దగ్గరికి వెళ్లింది. అన్న కోసం ఆమె వెనకే బాలుడు కూడా వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసేయడంతో టైరు కింద పడి బాలుడు మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాలకు రాకపోకలు నిలవొద్దు!

- వరద ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!
- గతానుభవాలతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 :** గోదావరి వరదలతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో గోదావరి వరదల ముందస్తు ప్రణాళికపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను, నదీ తీరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు.

**అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు..**

గత వరదల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రాకపోకలు నిలిచిపోయే గ్రామాలను గుర్తించి, అక్కడికి అత్యవసర వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందస్తు కార్యాచరణతో ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలన్నారు. సురక్షిత తాగునీరు, వైద్యం లాంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వరదల సన్నద్ధతపై పలు సలహాలు, సూచనలు చేసిన ఈ సమీక్షా సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, మేయర్ మూడ్ గణేశ్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రపంచం చూపు.. తెలంగాణ వైపు!

- 'తెలంగాణ రైజింగ్' తో దేశ, విదేశీ సంస్థల ఆకర్షణ
- నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు బహుళజాతి కొలువులు
- టాటా మోటార్స్, స్నైడర్ లో భారీగా ఉద్యోగాలు
- యాపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది యువతులకు ఛాన్స్
- సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ హర్షం



**హైదరాబాద్, జూన్ 27 :** నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విధానం ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో కొలువులు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు పెట్టారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని సీఎం పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు.

**బహుళజాతి సంస్థల్లో కొలువులు..**

ఇటీవల జరిగిన నియామకాల్లో స్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్ లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. ఫాక్స్ కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

**క్యూ కడుతున్న పెట్టుబడులు..**

తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను విశేషంగా ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడే పల్స్ పోలియో!

**5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరి.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన సర్కారు**

**బూత్‌లు, ఇంటింటికి వెళ్లి పంపిణీ.. మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష**



**హైదరాబాద్, జూన్ 27 :** ఐదేళ్ల లోపు చిన్నారులను మహమ్మారి నుంచి రక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక్క చిన్నారీ మిగిలిపోకుండా బూత్‌లతో పాటు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం నుంచి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. పుట్టినప్పటి నుంచి 5 సంవత్సరాల వయసు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకు సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 28వ తేదీన బూత్‌లలో పంపిణీ చేస్తారు. 29, 30 తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో జూలై 1న కూడా అదనంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పల్స్ పోలియో ఏర్పాట్లపై మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యా శాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో చివరి పోలియో కేసు నమోదైందని, అప్పటి నుంచి పోలియో రహిత హోదాను కొనసాగిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**ఖమ్మం,జూన్ 27:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం మేరకు.. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన ఓ రైతు తన తండ్రి ఇచ్చిన ఐదు గుంటల స్థలంలో రేకుల గది నిర్మాణానికి, ఇంటి నంబర్ కోసం గత నెల 19న దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం అనుమతి, ఇంటి నంబర్ కేటాయించటానికి పంచాయతీ కార్యదర్శి సురేష్.. బాధితుడ్ని రూ .40వేలు లంచం డిమాండ్ చేశారు. అంత నగదు ఇచ్చుకోలేనని రూ .25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ముదిగొండలోని రైతు వేదిక వద్ద బాధితుడి వద్ద నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా సురేశ్‌ను రెడ్ హ్యాండ్‌డెగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అనంతరం బాణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశామన్నారు.

# హామీలన్నీ నెరవేరుస్తాం!

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం భరోసా**

**32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు..**

**జూలై నుంచే 11 శాతం పీఆర్సీ అమలు.. త్వరలో గుర్తింపు సంఘాల ఎన్నికలు**



**హైదరాబాద్, జూన్ 27 :** ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ కొందరు సంఘాల నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ విలీనం, కార్మికుల సమస్యలపై కీలక విషయాలు వెల్లడించారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి దాదాపు 30 కార్మిక సంఘాల ప్రతినిధులతో 14 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించినట్లు గుర్తుచేశారు. ఈ సమావేశంలో కార్మికులు అడిగిన 32 డిమాండ్లలో 29 డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్య పరిధిలో ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పరిధిలో ఉన్న 3 కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ప్రభుత్వంలో విలీనంపై తగిన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం పీఆర్సీని జూలై నెల జీతాల నుంచే అమలు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పక్క రాష్ట్రంలో ఎదురైన ఇబ్బందులు ఇక్కడ రాకుండా ఉండేందుకు ఆర్టీసీ విలీన విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులకు తప్పనిసరిగా చోటు కల్పిస్తామన్నారు. ఈ మేరకు సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని తెలిపారు. విలీన కమిటీలో గుర్తింపు పొందిన సంఘం నుంచే ప్రతినిధులు ఉండాలని నిర్ణయించామని, అందుకోసం ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ఎన్నికల నోడల్ అధికారిగా జాయింట్ లేబర్ కమిషనర్ సునీతను నియమించినట్లు తెలిపారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. ఎన్నికలు జరగకుండా కొందరు నాయకులు విలీన ప్రక్రియను వివాదస్పదం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట మీద నిలబడేదని, విలీనంపై భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకే పకడ్బందీగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. కార్మికులు అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కూల్చడంలో హిట్లర్.. నీళ్లలో నీరో!



- 3 రాష్ట్రాల సీఎంల రహస్య ఒప్పందాలు
- మేడిగడ్డ వదిలి.. తుంగభద్రకు మరమ్మతులా?
- బీఆర్ఎస్ పోరాటంతోనే దిగొచ్చిన సర్కారు
- ఏపీ ప్రాజెక్టులపై ఎందుకు నోరుమెదపరు?
- రేవంత్ తీరుపై హరీశ్ రావు ఎద్దేవా

**హైదరాబాద్, జూన్27:** కర్ణాటకలో 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారులను బయటపెట్టి రహస్యంగా చేసుకున్న చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టేలా పక్క రాష్ట్రాల ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలొగ్గారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల కర్ణాటకలో 3 రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులను సైతం లోపలికి రానివ్వకుండా కేవలం 4 గురు మాత్రమే కూర్చుని ఏం మాట్లాడుకున్నారో చెప్పాలని హరీశ్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో నవలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడుతుంటే.. మన సీఎం చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఏపీ సీఎం తన శిష్యుడైన రేవంత్ ఇక్కడ సీఎం అయ్యాడన్న ధీమాతోనే గుండ్రేవులను ముందుకు తెచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. నీటి అనుమతుల విషయంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైందన్నారు. గత 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ఏటా 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీల్లో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ అక్రమంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతోందని, బీఆర్ఎస్ ప్రశ్నించాకే వాళ్లకు మెలకువ వచ్చిందని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టును ఎండబెడుతూ, మేడిగడ్డ గేట్లు రిపేర్ చేయడం చేతగాని సీఎం.. తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం వెళ్లారని విమర్శించారు.

## ఏపీ సుజలం.. తెలంగాణ నిష్ఫలం..

ఇండ్లు కూల్చడంలో సీఎం రేవంత్ కు హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో మాత్రం రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తిగా కనిపిస్తున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఏపీ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోండి

- ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు
- కాంగ్రెస్ పాలనలో కుంభకోణాల జాతర
- మహేశ్వరం సభలో కేటీఆర్ దిశానిర్దేశం

**రంగారెడ్డి, జూన్27:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలి.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి అన్నదే ఇప్పుడు తెలంగాణ నలుదిశలా వినిపిస్తున్న నినాదమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్‌గా తీసుకుని, అర్హులైన ఓటర్ల పేర్లు గల్లంతు కాకుండా కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. డిజిటల్ రూపంలో పార్టీ సభ్యత్వ నమోదును భారీ ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డు ఇస్తామని, దీనిద్వారా ఎక్కడికెళ్లినా గౌరవం లభిస్తుందని చెప్పారు. మహేశ్వరంలో మరోసారి సబితమ్మ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. వచ్చే



అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రైతుబంధు పోయి.. రాహుల్ బంధు వచ్చింది..

కాంగ్రెస్ రాకతో రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంట్ కోతల కాలం వచ్చిందని, రైతుబంధు పోయి రాహుల్ బంధు వచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పాతరేసి కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రజలంతా కేసీఆర్ ను మాత్రమే తలుచుకుంటున్నారని గుర్తు చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. పదవులు కేసీఆర్ కు కొత్త కాదని, 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయన సొంతమని పేర్కొన్నారు.

## త్యాగాల స్ఫూర్తితోనే 10 ఏళ్ల పాలన..

తెలంగాణ ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద ప్రాణత్యాగం చేశారని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే 10 ఏళ్ల పాటు కేసీఆర్ పాలన సాగిందని చెప్పారు. ఆ పదేళ్లలో ప్రజా సంక్షేమం, ప్రగతి జోడెడ్లలా ముందుకు సాగాయన్నారు. బీఆర్ఎస్ ఓడిపోవడం వల్ల ఎవరు నష్టపోయారో రాష్ట్ర ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు.

# వానొచ్చె.. జాగ్రత్త!

**రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు**

**వచ్చే 7 రోజుల పాటు విస్తారంగా వర్షాలు.. జూలై 2 వరకు ఆరెంజ్ అలర్ట్**

**ఖమ్మం, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్.. హైదరాబాద్‌లో భారీ వర్షం**



**హైదరాబాద్, జూన్27:** రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ఇన్నాళ్లూ ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన తెలంగాణ ప్రజలకు వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా రానున్న 7 రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. రుతుపవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూలై 2వ తేదీ వరకు రాష్ట్రానికి 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. మధ్య తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని అంచనా వేశారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే కురుస్తాయని వివరించారు.

## ఖమ్మం, వరంగల్‌కు ఎల్లో అలర్ట్..

ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆ రెండు జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. వీటితో పాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

## భాగ్యనగరంలో రాత్రి పూట భారీ వాన..

రాజధాని హైదరాబాద్‌లో ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వానల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

**హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన**

**నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం**

**నల్లగొండ, జూన్ 27:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# భద్రతపై ఆర్ఎస్‌కు ఆందోళన అవసరం లేదు

**సిఎం స్వయంగా తన కాన్వాయ్‌లో భద్రతను కుదించారు: విప్ అద్దంకి దయాకర్**

**హైదరాబాద్,జూన్ 27 :** ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రతపై అనుమానాలు అవసరం లేదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన వ్యక్తిగత భద్రత విషయంలో అనవసర అనుమానాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఆయన భద్రతకు సంబంధించి అవసరమైన నిర్ణయాలు పోలీసు శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన భద్రతను తగ్గించుకున్నారని దయాకర్ తెలిపారు. సీఎం కాన్వాయ్‌లో గతంలో ఉండే జామర్, అంబులెన్స్ వంటి వాహనాలు ప్రస్తుతం లేవని, మొత్తం మూడు వాహనాలతోనే ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా, సీఎం ప్రయాణాలకు ప్రత్యేక ట్రాఫిక్ క్లియరెన్స్ కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ముప్పు లేదని కేంద్ర ప్రభుత్వమే ప్రకటిస్తోందని దయాకర్ గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత భద్రత అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. ఒకవేళ తనకు అదనపు భద్రత అవసరమని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భావిస్తే, అధికారికంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని సూచించారు.



# రోహింగ్యాలను పంపించేయాలి!

**పాక్, బంగ్లా చొరబాటుదారులకు ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు**

**హైదరాబాద్ లో పరిస్థితిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆందోళన**

**పాతబస్తీలో బీఎల్ఓలను బెదిరిస్తున్న మజ్లిస్ నేతలు**

**ఓటర్ల జాబితా సవరణను అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్ జూన్27:** హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్ వాసులను వెంటనే గుర్తించి వెనక్కి పంపాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. చొరబాటుదారులకు ఇక్కడ ఓటు హక్కు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు కూడా ఉన్నాయని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా ఓటర్ల జాబితా సవరణను ఎవరూ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. రాంకోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం పరిశీలించారు. అక్కడ చిన్నారులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం భాజపా కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నగరంలోని పాతబస్తీలో బీఎల్ఓలను మజ్లిస్ నేతలు తీవ్రంగా బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో పనిగట్టుకుని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా, ఎలాంటి బెదిరింపులకు గురిచేసినా సమగ్ర ఓటరు జాబితా సవరణను మాత్రం అడ్డుకోలేరని కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు.


# గుట్ట ఇవోగా మరో ఏడాది పాటు భవానీ శంకర్

**పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం**

**యాదగిరిగుట్ట, జూన్27:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఇవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు. 2027 జూన్ 30 వరకు ఆయన దేవస్థాన ఈవోగా కొనసాగుతారని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే వరకు పొందిన వేతనంలో పింఛన్ మినహాయించగా మిగిలిన మొత్తం ఆధారంగా వేతనాన్ని నిర్ణయించిన్నట్లు చెప్పారు. గతంలో గవర్నర్‌కు జాయింట్ సెక్రెటరీగా పని చేసిన భవానీశంకర్‌ను దేవస్థాన ఈవోగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 17న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా అదే నెల 29న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి ఆయన ఈవో పదవిని పొడిగించారు. సమర్థుడైన అధికారిగా భవానీ శంకరుకు పేరుంది.

# శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచారం

**స్థానికుల సమాచారంతో అధికారుల వేట**



**హైదరాబాద్,జూన్27:** హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్నయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా?

**దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది.**

సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాగీ పై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో దృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాగీ తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాగీ తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాగీ సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాగీ కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాగీ గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాగీ పై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాగీ పై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాగీ రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు గీ డీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాగీ వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

**• ఎన్నికల సంఘం కీలక ప్రకటన**







**న్యూఢిల్లీ, జూన్ 27 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోగీ ల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు. ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

**• గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా**




**గాంధనగర్, జూన్ 27:** రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# ఎర్రకోట పేలుడు కుట్ర కేసులో మరో చార్జ్‌షీట్

**న్యూఢిల్లీ, జూన్ 27 :** ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మరో ముగ్గురు నిందితులపై అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలైన ఈ చార్జ్‌షీట్‌లో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ముజఫర్ అహ్మద్ అలియాస్ ఫరాజ్ అలియాస్ జఫర్‌తో పాటు జమీర్ అహ్మద్ అహంగర్, తుఫెయిల్ అహ్మద్ భట్ పేర్లను చేర్చింది. దీంతో ఈ కేసులో మొత్తం నిందితుల సంఖ్య 13కు చేరింది. ఎన్ఐఏ వివరాల ప్రకారం, ముజఫర్ అహ్మద్ వృత్తిరీత్యా శిశు వైద్య నిపుణుడు (పీడియాట్రిషియన్), ఎండీ పట్టభద్రుడు. కేసులో ఇప్పటికే నిందితుడిగా ఉన్న డాక్టర్ అదీల్ అహ్మద్ రాథార్‌కు అతడు సోదరుడు. అల్‌ఖైదా అనుబంధ ఉగ్ర సంస్థ ఏజీయూహెచ్ వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్న ముజఫర్, పేలుడు కుట్రలో కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ఐఏ పేర్కొంది. 2022లో శ్రీనగర్‌లో జరిగిన రహస్య సమావేశంలో ఈ ఉగ్ర సంస్థ ఏర్పాటైందని, అనంతరం ఫరీదాబాద్‌లో ఏర్పాటు చేసిన రహస్య కేంద్రంలో పేలుడు పదార్థాన్ని తయారు చేసి పరీక్షించినట్లు అధికారులు వెల్లడించారు. బాంబు తయారీ, నిల్వ, పరీక్షలన్నింటిలోనూ ముజఫర్ కీలకంగా వ్యవహరించినట్లు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అతడిపై ఇప్పటికే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కాగా, అరెస్టు కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. మరో నిందితుడు జమీర్ అహ్మద్ అహంగర్ ఉగ్రసంస్థకు నగదు, మందుగుండు సామగ్రి రవాణా చేసే కొరియర్‌గా పనిచేసినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. తుఫెయిల్ అహ్మద్ భట్ గతంలో లష్కర్ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొని, ఈ కుట్రకు పేలుడు పదార్థాలు, ఆయుధాలు సమకూర్చినట్లు చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

# నాలుగు తరాల భూ వివాదానికి స్వస్తి

**• సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు**




**న్యూఢిల్లీ, జూన్ 27:** సుదీర్ఘంగా నాలుగు తరాలుగా నడుస్తున్న ఒక సంక్లిష్ట భూ వివాదానికి సుప్రీం కోర్టు తాజాగా చెక్ పెట్టింది. ఆ భూమికి సంబంధించి 1957లో జరిగిన సేల్ డీడ్ (క్రయ విక్రయ పత్రం) పూర్తిగా చట్టబద్ధమైనదేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం స్పష్టమైన తీర్పును వెలువరించింది. ఈ కేసు వివరాల ప్రకారం, ప్రస్తుత అప్పీలుదారుడైన సరాఫత్ అలీ పూర్వీకులు 1957వ సంవత్సరంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో కొంత భూమిని కొనుగోలు చేశారు. ఆ సమయంలో సరాఫత్ అలీ మైనర్ కాగా, నాటి నుంచి సదరు భూమి సరాఫత్ అలీ కుటుంబం యొక్క ఆధీనంలోనే ఉంటూ వస్తోంది. అయితే, ఆ భూమిని అమ్మిన కొందరు వ్యక్తులు తదనంతరం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్) పూర్తయినప్పటికీ రెవెన్యూ రికార్డులలో మ్యుటేషన్ (నమోదు) ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత చాలా కాలానికి, అనగా 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యుటేషన్ ప్రక్రియ కూడా సజావుగా పూర్తయ్యింది.

## ఏకీకరణ ప్రక్రియ - వివాదం పునరావృతం

ఇదిలా ఉండగా, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ (కన్సాలిడేషన్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో సదరు భూమిపై తనను అధికారిక భూమిదారుగా గుర్తించాలని కోరుతూ సరాఫత్ అలీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిని పరిశీలించిన కన్సాలిడేషన్ అధికారి 1993లో సరాఫత్ అలీకి ఉన్న హక్కులను గుర్తిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే, ఈ భూమిపై 'కో టెన్యూర్' (సహ హక్కులు) ఉన్నాయంటూ మరికొందరు వ్యక్తులు మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ కొత్త వివాదం కారణంగా 1999లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. 'యూపీ జమీందారీ భూముల రద్దు చట్టం' ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, నాటి సేల్ డీడ్ పత్రాలపై సంతకం చేసిన సాక్షి యొక్క పూర్తి వివరాలలో స్పష్టత లేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ సరాఫత్ అలీ కుటుంబానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ వివాదంపై తదుపరి పోరాటంలో భాగంగా హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా సరాఫత్ కుటుంబానికి చుక్కెదురైంది.

## సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

ఈ నేపథ్యంలో కేసును విచారించిన సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేస్తూ సరాఫత్ అలీ కుటుంబానికి న్యాయం చేకూర్చింది. పత్రాలపై ఉన్న సాక్షి వివరాలలో దొర్లిన స్వల్ప లోపాలను లేదా అస్పష్టతను ఆధారంగా చేసుకుని, దశాబ్దాల క్రితం జరిగిన సేల్ డీడ్ మొత్తాన్ని చెల్లదని కొట్టిపారేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాకుండా, సదరు సేల్ డీడ్ ఫోర్జరీ (నకిలీది) జరిగిందనే ఫిర్యాదులు లేదా ఆరోపణలు ఎక్కడా లేకపోవడాన్ని న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించింది. జమీందారీ చట్టానికి 1981వ సంవత్సరంలో తీసుకువచ్చిన సవరణలను, అంతకంటే ఎంతో ముందుగా అంటే 1957లో జరిగిన లావాదేవీలకు వర్తింపజేయడం కుదరదని కోర్టు తేల్చిచెప్పింది. నాటి సేల్ డీడ్ పూర్తిగా చెల్లుబాటు అవుతుందని ప్రకటిస్తూ, నాలుగు తరాలుగా నలిగిన ఈ భూవివాదానికి సుప్రీం కోర్టు శాశ్వతంగా ముగింపు పలికింది.

చురకలు



# రాజన్న ఆలయ విస్తరణ పనులు శరవేగం

- **35 శాతం పనులు పూర్తి.. భక్తులకు మెరుగైన దర్శనం, వసతులే లక్ష్యం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ జూన్27:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శనివారం ఆలయ విస్తరణ పనులు, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇప్పటికే ఆలయ విస్తరణ పనులు 35 శాతం పూర్తయ్యాయని, శృంగేరి పీఠం సూచనలు, ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. అద్దాల మండపం, బ్రాహ్మణ సత్రం, నిత్య అన్నదాన సత్రం తదితర నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. రాజన్న ఆలయాన్ని మరో వెయ్యేళ్లు నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామని, రూ.47 కోట్లతో రహదారి విస్తరణ, రూ.6 కోట్లతో వంతెన నిర్మాణం, రూ.20 కోట్లతో బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, వచ్చే ఏడాదిలోపు ఆలయ విస్తరణ పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు, దర్శనాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## ఎస్‌బీఐ–తెలంగాణ ప్రభుత్వం మధ్య వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 27:**

తెలంగాణ ప్రభుత్వం–స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య కొనసాగుతున్న అంశంపై శనివారం సచివాలయంలో మరోసారి చర్చలు జరిగాయి. ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, టీజీఐఐసీ వీసీ & ఎండీ కె. శశాంకతో పాటు ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జి.ఎస్. రాణా, తెలంగాణ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయ స్థలాలను ఈ నెల 23న పరిశీలించిన అనంతరం, వాటిని ఎస్‌బీఐ అంగీకరించింది. బ్యాంకు బోర్డు ఆమోదం అనంతరం తదుపరి చర్యలు చేపడతామని ఎస్‌బీఐ అధికారులు తెలిపారు. కోర్టు విచారణకు అనుగుణంగా అవసరమైన ప్రక్రియను కొనసాగిస్తామని వెల్లడించారు. చర్చల అనంతరం ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సామరస్య పూర్వక పరిష్కారానికి వచ్చాయని, చట్టపరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే అంశాన్ని త్వరితగతిన ముగించనున్నట్లు వెల్లడించారు.



## ఖైదీలు న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలి: పి. అరుణ కుమారి



**హైదరాబాద్, జూన్ 27:.**

ఖైదీలు తమ చట్టపరమైన హక్కులు, న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి పి. అరుణ కుమారి అన్నారు. ఆమె చంచల్‌గూడ కేంద్ర కారాగారం, మహిళా కేంద్ర కారాగారాన్ని సందర్శించి ఖైదీల సంక్షేమం, ఉచిత న్యాయ సహాయం, పెండింగ్ కేసులు, బెయిల్ దరఖాస్తులు, అప్పీలు తదితర అంశాలను సమీక్షించారు. అర్హులైన ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖైదీలకు చట్టపరమైన అవగాహన, న్యాయ సహాయ దరఖాస్తుల త్వరిత పరిష్కారం, వైద్య సేవలు, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, వృత్తి నైపుణ్య శిక్షణ, పునరావాస కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా సంస్థల మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హ ఖైదీకి నాణ్యమైన ఉచిత న్యాయ సహాయం అందించడం జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జైలర్ గణేష్, మహిళా కేంద్ర కారాగార డీఎస్పీ అమరావతి, కారాగార శాఖ అధికారులు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం: ఆది శ్రీనివాస్



**సిరిసిల్ల జూన్27:.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో టెస్కో, చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి చీరల సేకరణ, నేతన్న పొదుపు పథకం కార్యక్రమాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రూ.300 కోట్ల బకాయిలు చెల్లించామని, ఈ ఏడాది తొలి విడతగా 3 కోట్లకు పైగా మీటర్ల చీరల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. దీంతో 4 వేల మంది మరమగ్గాల కార్మికులు, 1,500 మంది అనుబంధ రంగాల కార్మికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. రూ.50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ నేతన్న పొదుపు పథకం ద్వారా 5,534 మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని, కార్మికుల వేతనంలో 8 శాతం, ప్రభుత్వం 8 శాతం చొప్పున జమ చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సిరిసిల్లలో తయారవుతున్న ఇందిరా మహిళా శక్తి చీరలకు మంచి ఆదరణ లభిస్తోందని, నాణ్యమైన ఉత్పత్తులతో కార్మికులకు స్థిరమైన ఉపాధి కలుగుతోందని పేర్కొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల, జూన్ 27:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37, 40, 51 డివిజన్లలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించిన ఆయన, జూలై 24 వరకు ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. బీఎల్‌ఓలు ఫారాల పంపిణీ, సేకరణ, యాప్‌లో వివరాల నమోదు ఖచ్చితంగా చేయాలని, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ ఎపిక్ కార్డులు కలిగిన వారి వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**రేగొండ జూన్27:.**

రేగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో బయాలజీ, 9వ తరగతి విద్యార్థులతో గణితం చెప్పించి వారి ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. చెంచుకాలని నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదా సైకిళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




## ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ

**రాయపోల్ జూన్ 26:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్). ప్రక్రియలు భాగంగా శనివారం మండల కేంద్రం రాయపోల్ లో బూత్ లెవెల్ ఆఫీసర్లు(బిఎల్వో )లు ఆగమ,పద్మ,రజితలు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. బిఎల్వోలు ఇంటింటికి తిరుగుతూ పత్రాలను అందజేశారు. ఓటర్లు పత్రంలో అడిగిన సమాచారం నింపి ఫోటో అతికించి ఇవ్వాలని ఎలాంటి అపోహలు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసానపల్లి రాజు,ఉప సర్పంచ్ హనుమంతు రాజు,సూపర్వైజర్ నర్సింలు,ఆయుష్ ఫార్మసిస్ట్ లింగం,తదితేరులు ఉన్నారు.



## రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోవాలి

**రాయపోల్ జూన్ 26:**

రైతు భరోసా కు దరఖాస్తు చేసుకో వాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు నరేష్ తెలిపారు.ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 2025- 26, 2026- 27 సంవత్సరాలకు గాను ఇంతవరకు రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోని వారు జులై 5 వ తేదీ లోపు దరఖాస్తు లను సంబంధిత క్లస్టర్ లలోని ఏ ఈ ఓ లకు సమర్పించాలని తెలి పారు.రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునే రైతులు తప్పనిసరిగా పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు,బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ జిరాక్సతో అప్లికేషన్ కు జత చేయాల్సి ఉంటుందన్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఐడీఓసీ ప్రాంగణంలో వనమహోత్సవం



**ఖమ్మం జూన్27:.**

వనమహోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఐడీఓసీ ప్రాంగణంలో పద్మశ్రీ వనజీవి రామయ్య గారి సతీమణి శ్రీమతి జానమ్మ గారి చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ సి.హెచ్. రామమూర్తి పాల్గొన్నారు. హార్టికల్చర్ అధికారి శ్రీమతి అనితశ్రీ, గార్డెన్ ఇన్‌చార్జి హసీన బేగం, సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఐడీఓసీ ప్రధాన ద్వారం ముందు భాగంలో ఈ మొక్కలను నాటగా, ఈ మొక్కలను గౌరవనీయులైన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సతీమణి ఐడీఓసీకి పంపించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట: మంత్రి పొంగులేటి



**ఖమ్మం, జూన్ 27:.**

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని దానవాయిగూడెం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల జూనియర్ కళాశాలలో రూ.2.25 కోట్లతో చేపట్టనున్న మౌలిక వసతుల అభివృద్ధి, మరమ్మత్తుల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలోని ఊటవాగు తండా వద్ద రూ.6.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న చెక్‌డ్యామ్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు.

## న్యూ మోతి నగర్‌లో ఆహార విషబాధ.. 41 మంది ఆస్పత్రిలో చేరిక

**మహబూబ్ నగర్ జూన్27:.**

న్యూ మోతి నగర్‌లో జూన్ 25న జరిగిన వివాహ వేడుకలో ఇంట్లో తయారు చేసిన "కద్దు ఖీర్"ను జూన్ 26 మధ్యాహ్నం అనంతరం తినడంతో 41 మంది కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వారిని రాత్రి 11 గంటలకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల్లో 26 మంది పిల్లలు, ఒక గర్భిణి ఉన్నారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు, డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. శశికాంత్ ఆస్పత్రిని సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. బాధితులందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, పూర్తిగా కోలుకున్న అనంతరం డిశ్చార్జ్ చేస్తామని అధికారులు తెలిపారు.

## మరిపెడలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు



**మరిపెడ,జూన్27:**

మరిపెడ పట్టణంలోని రాజీవ్ సెంటర్ నుండి కార్గిల్ సెంటర్ వరకుజాతీయ రహదారి-563 వెంట ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను శనివారం స్థానిక పోలీసులు,సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తొలగించారు.ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక చర్యలో ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబండ్ల ను తొలగించారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, పాదచారులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా సహకరించాలని సూచించారు.భవిష్యత్తులో ఎవరైనా మళ్లీ ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పట్టణంలో నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

చురకలు



## 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞతో మాదకద్రవ్యాలపై విద్యార్థుల్లో చైతన్యం



**మరిపెడ,జూన్27:**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మరిపెడ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఈ.అనంతరావు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యం,విద్యాభివృద్ధి,కుటుంబ వ్యవస్థతో పాటు సమాజానికే తీవ్ర హానికరమని అన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లు అలవరచుకోవాలని, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు.ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన రాయబారిగా మారాలని పిలుపునిచ్చారు.అనంతరం స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో "నషా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని,మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధనాచారి,దేవుల,శ్రీశైలం,నెహ్రూ, స్వప్న,ప్రకాష్,శౌరి,రమేష్ రెడ్డి,లెనిన్, ప్రసాదరావు,సారయ్య,జహీదా బేగం, సురేష్,బాబురావు,అనిత, రాజకుమారి,సుధా,మంజుశ్రీ, భువనేశ్వరి,శంకర్ తదితరులు, విద్యార్థినీ,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొల్లి వ్యాధిపై అవగాహన

### ప్రపంచ విటిలిగో దినోత్సవం






**చేవెళ్ల, జూన్,27:**

వికారాబాద్ జిల్లా చేవెళ్ల: వీటిలోగో దినోత్సవం: డాక్టర్.అశోక్ బాబు( HOD)డెర్మటాలజీ, వెనీరియాలజీ & లెప్రసీ (DVL) విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ విటిలిగో దినోత్సవాన్ని డాక్టర్. పట్నం మహీందారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో ఘనంగా నిర్వహించారు. బొల్లి (Vitiligo) ఒక అంటువ్యాధి కాదని, దీనిపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమానికి మెడికల్ కాలేజ్ మెడికల్ సూపరింటెండెంట్ (ఎం.ఎస్) డాక్టర్.రామక్రిష్ణారెడ్డి, అకాడమిక్ హెడ్ డాక్టర్. గౌరీ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.రంజిత్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పోస్టర్ ప్రదర్శనలు, రంగవల్లి (రంగోలి) పోటీలు, అవగాహన ర్యాలీ, బొల్లి వ్యాధిపై సందేశాత్మక నాటిక (స్కిట్), క్విజ్ పోటీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.అలాగే బొల్లి వ్యాధితో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ తగిన వైద్య సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కీర్తన, DVL విభాగానికి చెందిన పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఇంటర్న్‌లు, మెడికల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వరంగల్ కౌశల్ మహోత్సవ్ లో వెయ్యికి పైగా యువతకు ఉద్యోగాలు




**వరంగల్, జూన్ 27:.**

కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ), తెలంగాణ ప్రభుత్వం, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డీసీ) సంయుక్తంగా వరంగల్‌లోని కిట్స్ కళాశాలలో నిర్వహించిన కౌశల్ మహోత్సవ్–2026లో వెయ్యికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ మహోత్సవానికి 4,500 మందికి పైగా యువత నమోదు చేసుకోగా, 2,200 మందికి పైగా ప్రత్యక్ష నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. 90కి పైగా ప్రముఖ సంస్థలు తయారీ, ఆటోమొబైల్, లాజిస్టిక్స్, వస్త్ర, రిటైల్, ఆరోగ్య, ఐటీ, టెలికాం, పర్యాటకం, బ్యాంకింగ్ తదితర రంగాల్లో ఉద్యోగాలను అందించాయి. ప్రత్యక్ష ఎంపికలో అవకాశం పొందని అభ్యర్థుల దరఖాస్తులను కూడా సంస్థలు తదుపరి దశల్లో పరిశీలించి అర్హులైన వారికి నేరుగా సమాచారం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కిట్స్ చైర్మన్ వి. సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజ్, నాయిని రాజేందర్ రెడ్డి, ప్రాంతీయ డైరెక్టర్ రవి చిలుకోటి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రోత్సాహక పథకం, స్కిల్ ఇండియా డిజిటల్ వంటి కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా 200కుపైగా విదేశీ ఉద్యోగ అవకాశాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.
- కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ-కలెక్టర్



**వికారాబాద్, జూన్ 27:**

శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు.ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు.18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.ఇలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని కలెక్టర్ తెలిపారు.ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారుల సూచించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా తరగతిలో బోధన విధానాన్ని, హాజరు శాతాన్ని పరిశీలించారు.కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుంటూరు, జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వీరకాంతం తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి సాహు జీ మహారాజ్ జయంతి వేడుకలు



**దుద్యాల మండలం, జూన్,27:**

వికారాబాద్ జిల్లా :దుద్యాల్ మండలంలోని చిల్మల్ మైలారం గ్రామంలో రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు జీ మహారాజ్ 152వ జయంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) చిల్మల్ మైలారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో అంబేద్కర్ విగ్రహము దగ్గర బి.ఎస్.పి కార్యకర్తల సమక్షంలో జయంతి కార్యక్రమమును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు అంజిలయ్య మాట్లాడుతూ బాబాసాహెబ్ డాII బి.ఆర్ అంబేద్కర్ లండన్ లో చదువుకోవడానికి స్కాలర్ షిప్ మంజూరు చేసిన గొప్ప దర్శనీకుడని కొనియాడారు. సామాజిక న్యాయం, విద్య అందరికీ అందాలని ఆనాడే పునాదులు వేసిన ధీరదత్తుడు ఆయనే అని గుర్తు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.ఎస్.పి కోడంగల్ అసెంబ్లీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం. మొగులయ్య, ప్రధాన కార్యదర్శి నింగి నరసింహ, కార్యదర్శి మైలారం హనుమంత్ మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతో సొంత ఇంటి కల సాకారం..



- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి
- గుండెపుడిలో బింగి నీరజ ఇందిరమ్మ గృహప్రవేశం..

**మరిపెడ,జూన్27 :**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి అన్నారు.మరిపెడ మండలం గుండెపూడి గ్రామానికి చెందిన బింగి నీరజకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిలో శనివారం గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెండ్లి రఘువీరారెడ్డి గృహప్రవేశాన్ని నిర్వహించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తోందన్నారు.ఇందిరమ్మ గృహాల పథకం ద్వారా అనేక కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సూరబోయిన ఉప్పలయ్య,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గడ్డం వెంకట్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులుసు మల్లేష్, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు రేఖ శ్రీను,పెద్దబోయిన శ్రీను,వడ్లకొండ రజిత, వార్డు సభ్యులు యాకన్న,నవీన్, నాయకులు ఓర ఉప్పలయ్య,అజ్మీర రమేష్,బాబు,ఇమ్మానుయేల్,రేఖఉప్పలయ్య,పద్మావత్ సోమన్న,రేఖ నరేష్,బాదావత్ నాగరాజు,పులుసు మహేష్ తదితరులు పాల్గొని బింగి నీరజ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

## సింగూర్ సెగ్మెంట్‌లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే

**కామారెడ్డి, జూన్ 27:**

సింగూర్ సెగ్మెంట్ పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల 14 మండలాల్లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఓ, డీఆర్‌డీఓ, భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక అభియంతతో కూడిన కమిటీ గ్రామాల వారీగా చేతి పంపులు, బోర్‌వెల్లు, సింగిల్ ఫేజ్ మోటార్లు, గ్రామీణ తాగునీటి పథకాల నీటి వనరులపై సర్వే నిర్వహించనుంది. సర్వే నివేదిక ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పునరుద్ధరణ, తాగునీటి వనరుల స్థిరీకరణకు చర్యలు చేపట్టనున్నారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా శాశ్వత పరిష్కారాలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయ నూతన భవనానికి రూ.2.25 కోట్లు మంజూరు

**హుస్నాబాద్ జూన్27:**

హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.25 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి మొత్తం రూ.263.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి రూ.2.25 కోట్లు కేటాయించింది. కొత్త భవనం నిర్మాణంతో అక్కన్నపేట మండల ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన రెవెన్యూ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు కార్యాలయ వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ నిధుల మంజూరుపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఐ డీ ఓ సి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, జూన్,27:**

నారాయణ పేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ లోని కలెక్టర్ ఛాంబర్, మీటింగ్ హాల్, అదనపు కలెక్టర్, ఏ వో చాంబర్లను పరిశీలించారు. బిల్డింగ్ లోపల చాంబర్ల కు కిటికీలు, తలుపులను వెంటనే బిగించాలని, వైరింగ్, శానిటరీ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలన్నారు. మీటింగ్ హాల్ లో ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్, మీటింగ్ హాల్ కలరింగ్ కోసం ఇతర జిల్లాలలోని కలెక్టరేట్ భవనాలలో ఆయా మీటింగ్ హాల్స్, కలెక్టర్ ఛాంబర్ల డిజైన్ల ను చూసి, అలాంటి వాటినే ఇక్కడ డిజైన్ చేయాలని ఆదేశించారు. అంతలోపు వుడెన్ వర్క్ ప్రారంభించాలన్నారు. అలాగే భవనం వెనుకభాగంలో దారిని ఏర్పాటు చేసి గేటును అమర్చాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. బిల్డింగ్ బయట ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయడానికి కుదరదని, హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని అధికారులు కలెక్టర్ కు తెలపగా, ఆ స్థలాన్నీ వాహనాల పార్కింగ్ కు కేటాయించాలని, పార్కింగ్ షెడ్డు పై మహిళా సంఘాల సభ్యుల సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటు గురించి అధికారులతో ఆమె చర్చించారు. అనంతరం కలెక్టర్ బంగ్లా వెనుక భాగంలో 2 ఎకరాలలో స్థలంలో 5 కోట్ల తో కొనసాగుతున్న ఇందిరా మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆ భవనంలోని మీటింగ్ హాల్, ఇతర గదులను చూశారు. భవనం బయట స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అవకాశం ఉంటే చూడాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. భవన ఆవరణలో ఒక వైపు రహదారిని ఏర్పాటు చేసి, మిగతా స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీ ఆర్డీ ఓ వెంకట్ రాములు కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ, డీ ఈ రాములు, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, ఆయా శాఖల ఏ ఈ లు, వర్క్ ఇన్స్పెక్టర్లు

# మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు 'మార్గదర్శక్' కార్యక్రమం ప్రారంభం

**మల్కాజిగిరి, జూన్ 27:.**




మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మల్కాజిగిరి పోలీసులు, మల్కాజిగిరి సెక్యూరిటీ కౌన్సిల్ (ఎంకెఎస్సీ) సంయుక్తంగా 'మార్గదర్శక్' ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి ఆధ్వర్యంలో చేపట్టిన 'మీ సురక్ష' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం డీసీపీ, ఎంకెఎస్సీ కన్వీనర్ శ్రీమతి టి. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మహిళల భద్రతలో సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. 'మార్గదర్శక్' వాలంటీర్లు బాధితులకు పోలీసు, న్యాయ, కౌన్సెలింగ్, అత్యవసర సేవలతో అనుసంధానం కల్పించే మార్గనిర్దేశకులుగా పనిచేయాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ భద్రత, చట్టపరమైన హక్కులు, హెల్ప్‌లైన్లపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోలీసులు–పౌర సమాజం భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి సకాలంలో సహాయం అందించి భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూన్ 27:**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాకు మంజూరైన 8,953 ఇళ్లలో 7,271 ఇళ్లకు (81 శాతం) గ్రౌండింగ్ పూర్తయిందని తెలిపారు. ఇంకా ప్రారంభం కాని ఇళ్లను వెంటనే ప్రారంభించి జూలై 15లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు గుడిసెల్లో నివసించే కుటుంబాలను గుర్తించి త్వరితగతిన నివేదికలు అందజేయాలని సూచించారు. ఇసుక, గ్రావెల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.



# రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

**నిజామాబాద్, జూన్ 27:.**

రెవెన్యూ రికార్డులు (పహాణీలు) తారుమారు చేసిన ఆరోపణలపై నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె. రాహుల్‌ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సస్పెండ్ చేశారు. కంటేశ్వర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 291/ఏ, 291ఏఏ, 292లకు సంబంధించిన రికార్డుల్లో టాంపరింగ్ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో శాఖాపరమైన సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసినా, విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# వర్షపు నీటి తొలగింపు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**మరిపెడ,జూన్27:**

మరిపెడ పట్టణంలో శనివారం కురిసిన భారీ వర్షానికి 3వ,9వ వార్డుల పరిధిలోని కార్గిల్ సెంటర్,గ్యామా తండా ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది.దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి వర్షంలోనే సంబంధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.జేసీబీ సహాయంతో నిలిచిన వర్షపు నీటిని తొలగించే పనులను పర్యవేక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య చర్యలు,డ్రైనేజీల శుభ్రపరిచే పనులు నిరంతరం కొనసాగించాలని ఆమె అధికారులను ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు తక్షణ సేవలు అందించాలని సూచించారు.స్థానికులు సైతం మున్సిపల్ యంత్రాంగం వేగంగా స్పందించి నీటి తొలగింపు చర్యలు చేపట్టడాన్ని అభినందించారు.



# మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

**ఆదిలాబాద్, జూన్ 27:**

మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించి వారిని అన్ని రంగాల్లో పోటీతత్వానికి సిద్ధం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల–కళాశాల (బాలుర) నూతన భవనాన్ని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతి గదులు, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించిన మంత్రులు విద్యార్థులు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు.



# హుస్నాబాద్‌కు రూ.148.97 కోట్ల వరం

### 74.49 కి.మీ హామ్ రహదారులకు ఆమోదం

**హుస్నాబాద్ జూన్27:**

నియోజకవర్గంలో 74.49 కిలోమీటర్ల మేర హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) కింద రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.148.97 కోట్లు మంజూరు చేసింది.హనుమకొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లోని మొత్తం 8 ప్రధాన రహదారుల విస్తరణ, బలోపేతం చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం, సురక్షిత రవాణా, వ్యవసాయ, వాణిజ్య, విద్య, వైద్య రంగాలకు మరింత సౌలభ్యం కలగనుంది. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ రహదారి ప్రాజెక్టులు కీలక మైలురాయిగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.

# జులై 2న ఉప్పల్ లో జరిగే భూ పోరాటాన్ని జయప్రదం చేద్దాం



**కొడంగల్, జూన్,27:**

టి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో భూపోరాటన్నీ జయప్రదం చేయండి జులై 2న ఉప్పల్ బగాయత్ లో జరిగే.భూ పోరాటాన్నికి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో,నుండి తెలంగాణ ఉద్యమ కారులు,తరలి రావాలని భూ పోరాట ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ .కోరడం జరిగింది.కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జ్,నీలి జనార్ధన్ భూ పోరాట ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ తెలంగాణ అమర వీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు తెలంగాణలో దగాపడ్డ కళాకారులకు తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచానికి చూపించిన జర్నలిస్టు మిత్రులకు తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్ నడి బొడ్డున ఉప్పల్ బగాయత్ లో 250 చదరపు గజాల స్థలాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన పేరుతో ఒక కమిటీ వేసి నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేని పేస్ట్ లో పెట్టిన విధంగా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జె.పి శ్యామ్ ప్రసాద్, దొబ్బలీ రాము, పుల్లనీ, చెన్నయ్య, నరేష్ యాదవ్,భీమయ్య గౌడ్ తదితరరులు పాల్గొన్నరు

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూన్ 27:**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం అభ్యసన ఫలితాలు, సమర్థవంతమైన బోధన, లెర్నింగ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళికలు అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు రెమెడియల్ బోధన అందించాలని, డిజిటల్ వనరులను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుంచి సుమారు వెయ్యి మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తాటిగూడలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**అదిలాబాద్ జూన్27:.**

ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాలను రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించి వస్త్రాలు అందజేశారు. అర్హులైన పేదలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో పాలన ప్రజలకు మరింత చేరువ: శైలజా రామయ్యర్




**రాజన్న సిరిసిల్ల, జూన్ 27:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో పాలన ప్రజలకు మరింత చేరువైందని జిల్లా ప్రత్యేక అధికారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా రూపొందించి, సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపంలో సిద్ధం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, డీ–అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం, సీపీఆర్ శిక్షణ, ఆరోగ్య సేవలు తదితర కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతిని అభినందించారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

### ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి



**మరిపెడ,జూన్27:**

మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం గ్రామపంచాయతీ రైతు వేదికలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం శనివారం చివరి రోజుతో ముగిసింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు గ్రామాభివృద్ధి,స్థానిక సంస్థల పరిపాలన,ప్రజా సమస్యల పరిష్కారం, బాధ్యతల నిర్వహణ తదితర అంశాలపై అవగాహనకల్పించారు.అనంతరం శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు పంచాయతీ కార్యదర్శులతో కలిసి సర్టిఫికెట్లనుఅందజేశారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీవోసూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెన్నెల నాగరాజు,ట్రైనర్లు రామోజీ, వెంకన్న,ప్రణయ్,పంచాయతీ కార్యదర్శులు అరుణ్ జ్యోతి, రాజేంద్రప్రసాద్,హారిక,విప్లవ,పావని, రామకృష్ణ,ఆపరేటర్ ఉమా,వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# జూలై 5లోగా దరఖాస్తు చేసుకోండి: కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జూన్ 27:.**

: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని జూలై 30న విడుదల చేయనున్న నేపథ్యంలో, అర్హులైన కొత్త పట్టాదారులు జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జూన్ 15, 2026 నాటికి వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు అర్హులని తెలిపారు. గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నంబర్ సమర్పించాలని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం లేకపోతే ఆన్‌లైన్ 1–బి ప్రతిని జతచేయవచ్చన్నారు. అర్హులైన రైతులు గడువులోగా దరఖాస్తు చేసుకుంటే వానాకాలం రైతు భరోసా కింద ఎకరానికి రూ.6,000 చొప్పున ఆర్థిక సాయం పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# కన్నాయిగూడెం పాఠశాలలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ



**కన్నాయిగూడెం జూన్27:.**

మండలంలోని కన్నాయిగూడెం ఆశ్రమ్ హైస్కూల్ బాలుర పాఠశాల, గంగుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఐటీడీఏ ఏటూరునగరం ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, ఆర్ఓ వాటర్ ప్లాంట్, బోర్‌వెల్ నీటి సరఫరా, తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఎస్‌సి విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాన్ని పరీక్షించి, పరిశుభ్రత పాటించడంతో పాటు బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల హాజరు పెంచాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. గంగుగూడెం ప్రాథమిక పాఠశాలలో కూడా హాజరు పట్టికలను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని సూచించారు.

# మిగిలిన ఆహారాన్ని నాణ్యత పరిశీలించిన తర్వాతే వినియోగించాలి:

## కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్,:.**

జూన్ 27: పెండ్లిళ్లు, శుభకార్యాలు, విందు కార్యక్రమాల అనంతరం మిగిలిన ఆహారాన్ని స్వీకరించే ముందు దాని నాణ్యత, తాజాదనం, పరిశుభ్రతను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఎక్కువసేపు గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేసిన ఆహారం ఫుడ్ పాయిజనింగ్ కు కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సేవా సంస్థలు, క్యాటరింగ్ నిర్వాహకులు పరిశుభ్రమైన పరిస్థితుల్లోనే ఆహారాన్ని పంపిణీ చేయాలని సూచించారు. ఆహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**కొత్తగూడెం జూన్27:.**

గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఎమర్జెన్సీ కేంద్రాలు, పునరావాస శిబిరాలు, క్విక్ రెస్పాన్స్ బృందాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్–ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అలాగే భద్రాచలం–కూనవరం కరకట్ట పనులను వేగవంతం చేయాలని, సారపాక జాతీయ రహదారి ఎత్తు పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# జూన్ 28 నుంచి పల్స్ పోలియో

## ప్రతి చిన్నారికి చుక్కలు వేయించాలి: డీఎంహెచ్ వో

**పాల్వంచ, జూన్ 27:.**

: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జూన్ 28 నుంచి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. జిల్లాలో 0–5 సంవత్సరాల వయస్సు గల 98,818 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 925 పోలియో బూత్‌లు, 38 ట్రాన్సిట్ పాయింట్లు, 1,001 బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేయడంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు.

# ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సర్వసాధారణం

## నారాయణపేట సీఐ శివశంకర్

**నారాయణపేట, జూన్,27:**



నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో గత సుమారు ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లకు శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి వారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి వారి సేవలను అభినందించారు.బదిలీపై మల్లేష్ మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు,రాము కృష్ణా పోలీస్ స్టేషన్‌కు, సృజన దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్,ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, ఒక ప్రాంతంలో విధులు నిర్వహించిన అనంతరం మరో ప్రాంతంలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం పోలీసు శాఖలో భాగమని అన్నారు. నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో ముగ్గురు కానిస్టేబుళ్లు క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు.ఎక్కడ విధులు నిర్వహించినా అదే సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని, చట్ట పరిరక్షణలో నిబద్ధతతో పనిచేస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.బదిలీపై వెళ్తున్న సిబ్బంది కొత్త విధి నిర్వహణ ప్రాంతంలోనూ అదే క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై 2 గాయత్రి, పోలీసు సిబ్బంది పాల్గొని బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కె. భాగ్యరాజ్ మృతికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తీవ్ర సంతాపం

**హైదరాబాద్, జూన్ 27:.**

తెలుగు, తమిళ సినీ పరిశ్రమలో దర్శకుడు, నటుడు, రచయితగా విశిష్ట సేవలు అందించిన ప్రముఖ సినీ దిగ్గజం కె. భాగ్యరాజ్ గారి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్, సమాచార పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి సంయుక్త ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. భారతీయ సినీ రంగంలో తనదైన కథన శైలి, అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో ప్రత్యేక గుర్తింపు పొందిన భాగ్యరాజ్ ను సినీ ప్రపంచం "కింగ్ ఆఫ్ స్క్రీన్‌ప్లే"గా గౌరవించిందన్నారు. దర్శకుడిగా, నటుడిగా, రచయితగా అనేక చిత్రాల ద్వారా ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తెలుగు ప్రేక్షకులతో కూడా ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన సినీ సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, తమిళ సినీ పరిశ్రమకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# దోమకొండ సంక్షేమ పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి, కలెక్టర్

**కామారెడ్డి, జూన్ 27:**



దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, విద్య, వసతి, ఆహారం, ఆరోగ్యం తదితర అంశాలపై వారితో ముచ్చటించారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వర్షాకాలంలో దోమతెరల వినియోగాన్ని తప్పనిసరి చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిఫాంలు త్వరితగతిన కుట్టించి పంపిణీ చేయాలని సూచించారు. బాల్య వివాహాల నివారణపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఘటనలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని కోరారు. పోషకాహారం ప్రాధాన్యతను వివరించిన వారు, అన్నం కంటే కూరలు, ఆకుకూరలు, పప్పు, గుడ్లు వంటి పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఆహారాన్ని వృథా చేయకుండా ప్రతి విద్యార్థి సరైన మోతాదులో పోషకాహారం తీసుకునేలా ఉపాధ్యాయులు, వార్డెన్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

# హెలెన్ కెల్లర్ జయంతి ఘనంగా నిర్వహణ

**జగిత్యాల జూన్27:.**




గ్రామీణాభివృద్ధి శాఖ (సెర్ప్) ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను దివ్యాంగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎం. రఘువరణ్ మాట్లాడుతూ, హెలెన్ కెల్లర్ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచారని, దివ్యాంగులు సెర్ప్ ఆధ్వర్యంలోని ప్రత్యేక సంఘాల్లో చేరి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ఏ. భాస్కర్ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత మాట్లాడుతూ ఉపాధి కల్పన కోసం ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మేడిపల్లి కళాకారుడు రవిని శాలువాతో సత్కరించి ప్రత్యేక చేతికర్రను అందజేశారు. వివిధ మండలాల నుంచి దివ్యాంగులు, అధికారులు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

## జిల్లా కలెక్టర్ కే. హైమావతి

**సిద్ధిపేట జూన్27:.**

ఆదివారం (జూన్ 28) నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. జిల్లాలో 0–5 ఏళ్లలోపు 94,321 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 568 కేంద్రాలు, 32 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వలస కుటుంబాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, క్వారీలు తదితర ప్రాంతాల్లోని పిల్లలకు మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జూన్ 29, 30 తేదీల్లో పోలియో చుక్కలు వేయించని చిన్నారులను ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గుర్తించి చుక్కలు వేస్తారని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామపంచాయతీ, ఐసీడీఎస్, విద్యాశాఖ తదితర శాఖలు సహకరించాలని కోరారు.



# పల్స్ పోలియోకు సర్వం సిద్ధం




## 34 బూత్‌లు,ప్రత్యేక మొబైల్ బృందాల ఏర్పాటు

**మరిపెడ,జూన్27:**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి తెలిపారు.ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి శనివారం పీహెచ్‌సీ ఆవరణలో వైద్యులు,ఆరోగ్య సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించి,కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు.మరిపెడ మున్సిపాలిటీలోని 15 వార్డులతో పాటు మండలంలోని 48 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న 7,200 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.ఇందుకోసం 34 పోలియో బూత్‌లు,ఒక మొబైల్ బూత్,బస్టాండ్‌లో ప్రత్యేక బూత్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమ పర్యవేక్షణ కోసం ఎడ్జెర్ల, తానంచెర్ల,చిల్లంచెర్ల రూట్లుగా మూడు ప్రధాన మార్గాలను విభజించి సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు.కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్, పీహెచ్‌ఎన్‌వో మంగమ్మ,హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,హెల్త్ అసిస్టెంట్లు,ల్యాబ్ టెక్నీషియన్లు,70 మంది ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి తల్లిదండ్రి సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# రాజకీయ దురంధరుడు పాములపర్తి

## నేడు పీవీ నరసింహారావు జయంతి

**సమకాలీన రాజకీయ పరిస్థితులను లోతుగా అర్థం చేసుకుని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ దేశాన్ని ముందుకు నడిపించే నాయకుడే నిజమైన రాజనీతిజ్ఞుడని చాణక్యుడు చెప్పాడు. ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో నిరూపించిన అరుదైన నాయకుల్లో పాములపర్తి వెంకట నరసింహారావు అగ్రగణ్యులు. దేశ రాజకీయాల్లో శాశ్వత ముద్ర వేసిన ఆయనను "అపర చాణక్యుడు"గా చరిత్ర గుర్తుంచుకుంది. దక్షిణ భారతదేశం నుంచి ప్రధానమంత్రి పదవిని అలంకరించిన తొలి నాయకుడు, ఇప్పటివరకు ఆ పదవిని అధిష్ఠించిన ఏకైక తెలుగు వ్యక్తి పీవీ. మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు పూర్తి కాలం విజయవంతంగా నడిపించడం, దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేయడం, భారత ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టడం ఆయన అసాధారణ రాజకీయ చాతుర్యానికి నిదర్శనం.**

### స్వాతంత్ర్యోద్యమం నుంచి ప్రధానమంత్రి వరకు

1921 జూన్ 28న వరంగల్ జిల్లా లక్నేపల్లిలో జన్మించిన పీవీ, తరువాత కరీంనగర్ జిల్లా వంగరకు చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులకు దత్తతగా వెళ్లారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. "వందేమాతరం" ఉద్యమంలో పాల్గొన్నందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం నాగపూర్ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను పూర్తి చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1957లో మంథని నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పీవీ, రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, చివరకు భారత ప్రధానమంత్రిగా ఎదిగారు. రాష్ట్రంలో న్యాయ, సమాచార, వైద్య, దేవాదాయ శాఖలను నిర్వహించగా, కేంద్రంలో విదేశాంగ, హోంశాఖ, రక్షణ, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్య శాఖలకు నాయకత్వం వహించారు. 1971 నుంచి 1973 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన భూ సంస్కరణలు, భూ గరిష్ట పరిమితి చట్టం, పట్టణ భూ గరిష్ట చట్టం అమలులో కీలక పాత్ర పోషించారు. తర్వాత ఢిల్లీ రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడిగా సేవలందించారు.

### ఆర్థిక సంస్కరణల శిల్పి

1991లో దేశం తీవ్ర విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించి సంచలనాత్మక ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ సరళీకరణ, విదేశీ పెట్టుబడులకు అవకాశం, ప్రభుత్వ రంగ సంస్థల సంస్కరణలు వంటి నిర్ణయాలతో భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపించారు. నేడు ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదగడానికి పీవీ వేసిన పునాదులే కారణమని ఆర్థిక నిపుణులు పేర్కొంటారు. ఇజ్రాయెల్‌తో పూర్తి స్థాయి దౌత్య సంబంధాల ఏర్పాటు, "లుక్ ఈస్ట్ పాలసీ" రూపకల్పన, పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని ప్రపంచానికి వివరించడం వంటి విదేశాంగ విజయాలు పీవీ ప్రభుత్వ ఖాతాలో నిలిచాయి. 1998లో జరిగిన పోఖ్రాన్ అణు పరీక్షలకు అవసరమైన ప్రాథమిక సన్నాహాలు కూడా ఆయన హయాంలోనే జరిగాయని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్వయంగా వెల్లడించారు.

### విద్యా సంస్కరణలకు మార్గదర్శి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల భావనను తీసుకొచ్చిన పీవీ, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు రూపకల్పన చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న ఆయన ఆలోచన నేటికీ ఫలితాలిస్తోంది. రాజకీయ నాయకుడిగానే కాకుండా పీవీ గొప్ప రచయిత, అనువాదకుడు, బహుభాషా పండితుడు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు 17 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే అరుదైన ప్రతిభ ఆయనది. విశ్వనాథ సత్యనారాయణ రచించిన "వేయి పడగలు" నవలను హిందీలో "సహస్ర ఫణ్" పేరుతో అనువదించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. "ఇన్‌సైడర్" అనే రాజకీయ నవల ఆయన రచనా ప్రతిభకు నిదర్శనం. ప్రధానిగా ఉన్న సమయంలో అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన ఆయన పాలనపై విమర్శలకు దారితీసింది. అలాగే పలు అవినీతి కేసులు ఎదుర్కొన్నప్పటికీ చివరికి అన్ని కేసుల్లోనూ న్యాయస్థానాల నుంచి విముక్తి పొందారు.

### నిరాడంబర జీవితం.. తెలుగు జాతికి గర్వకారణం

ప్రధానమంత్రి స్థాయిలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులను అధికారానికి దూరంగా ఉంచారు. జీవితాంతం నిరాడంబరంగా జీవించారు. చివరి రోజుల్లో కోర్టు కేసుల కోసం సొంత ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చిన నిజాయితీ నాయకుడిగా నిలిచారు. 2004 డిసెంబర్ 23న పీవీ కన్నుమూసినా, ఆయన వారసత్వం చిరస్థాయిగా నిలిచింది. హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే ఆయన స్మారక చిహ్నంగా నిలిచింది. దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహానేతగా, మేధావి రాజకీయవేత్తగా, బహుభాషా పండితుడిగా, తెలుగు జాతి గర్వించదగ్గ మహానుభావుడిగా పీవీ నరసింహారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బీమా చైతన్యం.. భవితకు ఆత్మ విశ్వాసం

## నేడు నేషనల్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్ డే







ప్రతి సంవత్సరం జూన్ 28న నేషనల్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్ డేను పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా బీమా రంగంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఈ ప్రత్యేక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో బీమా యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పడం, భవిష్యత్తు ఆర్థిక భద్రత కోసం బీమా అవసరాన్ని తెలియ జేయడం. అనిశ్చితతలతో నిండిన ఆధునిక జీవన విధానంలో బీమా ఒక ఆర్థిక సాధనంగా కాకుండా, కుటుంబాన్ని కాపాడే రక్షణ కవచంగా, మనసుకు భరోసానిచ్చే ఆశాజ్యోతిగా మారింది.

బీమా అనేది భవిష్యత్తులో సంభవించే నష్టాలను, ప్రమాదాలను ఎదుర్కొనడానికి ఆర్థిక భద్రతను కల్పించే విధానము. బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి నిర్దిష్టమైన మొత్తం ప్రీమియంగా చెల్లిస్తే, ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఒప్పందంలోని నిబంధనల ప్రకారం బీమా సంస్థ ఆర్థిక పరిహారం అందిస్తుంది. ఇది వ్యక్తిగత స్థాయిలోనే కాదు, కుటుంబం, వ్యవసాయం, వాహనం, ఆస్తి వంటి అనేక రంగాల్లో రక్షణ కల్పిస్తుంది. ఒకవేళ ఆర్థిక నష్టం జరిగినా, అది వ్యక్తి జీవన ప్రమాణాన్ని పూర్తిగా కూల్చి వేయకుండా అడ్డుకుంటుంది.

బీమాపై సరైన అవగాహన లేని ప్రజల శాతం భారత దేశంలో ఇంకా అధికంగానే ఉంది. కొందరికి ఇది అవసరం లేదనిపిస్తుంది, మరికొందరికి ఖర్చు లాగా అనిపిస్తుంది. కొంతమంది బీమా పాలసీ తీసుకున్నా, దాని ప్రయోజనాలు ఎలా పొందాలో తెలియదు. ఈ నేపథ్యంలో బీమా అవగాహన దినోత్సవం అత్యంత ప్రాధాన్యంతో కూడుకున్నదిగా నిలుస్తోంది. ఈ రోజును పురస్కరించుకుని ప్రజలకు బీమా రకాలు, వాటి ప్రయోజనాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎలా నష్టపరిహారం పొందాలో వంటి అంశాలపై వివరంగా తెలియ జేయడం జరుగుతుంది. మన జీవితాల్లో అనేక అప్రమత్తతలు ఉండవలసిన అవసరం ఉంది. అనారోగ్యం, ప్రమాదం, పంట నష్టం, వాహన ప్రమాదం, ప్రకృతి విపత్తులు వంటి అనేక సంఘటనలు మనకు ఎదురవుతుంటాయి. ఇవి వచ్చినప్పుడు పెద్ద మొత్తంలో ఆర్థిక భారం ఎదురవుతుంది. అలాంటి సమయంలో బీమా ఉండటం వల్ల ఆ భారాన్ని స్వల్పంగా చేయవచ్చు. ఉదాహరణకు, ఓ చిన్న ఆరోగ్య సమస్యకు ఆసుపత్రి ఖర్చు లక్షల్లో చేరుతున్న తరుణంలో ఆరోగ్య బీమా ఉండటం ఎంతో ఉపశమనంగా మారుతుంది. అలాగే, కుటుంబ పోషకుడు అకస్మాత్తుగా మృతి చెందితే జీవిత బీమా వల్ల కుటుంబానికి ఆర్థికంగా కుంగిపోకుండా ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. బీమా సేవల పరిధి రోజు రోజుకూ విస్తరిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న అన్ని రకాల బీమాలను ప్రజలు తెలుసుకోవడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, వాహన బీమా, గృహ బీమా, ప్రయాణ బీమా, పంట బీమా వంటి అనేక బీమా రకాలున్నాయి. ప్రతి ఒక్కటి ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు రూపొందించ బడ్డది. ప్రతి వ్యక్తి తన అవసరాన్ని బట్టి సరైన పాలసీ ఎంచుకోవాలి. ఇది కేవలం బీమా సంస్థల పక్కనుండి వెళ్లిపోవడం కాదు; భవిష్యత్తు కోసం ముందస్తుగా వేసే భద్రతా అడుగు.

బీమా రంగం భారత దేశంలో రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి ఉంది. 1818లో ప్రారంభమైన ఈ రంగం 1956లో జీవ సంస్థలన్నింటినీ ఏకీకృతంగా "భారత జీవిత బీమా సంస్థ"గా కలపడం ద్వారా పునర్ వ్యవస్థీకృతమైంది. 1999లో బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ ఏర్పడి, ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించడంతో బీమా మరింత విస్తృతమైంది. ప్రస్తుతం భారత జీవ బీమా సంస్థ, హెచ్.డి.ఎఫ్.సీ జీవ బీమా, ఎస్.బి.ఐ జీవ బీమా, ఐ.సి.ఐ.సి.ఐ ప్రమాద బీమా, న్యూ ఇండియా అష్యూరెన్స్ వంటి సంస్థలు ప్రజలకు విశ్వసనీయంగా సేవలందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా సామాన్యులకు బీమా అందుబాటులో ఉండేలా అనేక ప్రజా పథకాలను అమలు చేస్తోంది. అందులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ప్రజలకు తక్కువ ఖర్చుతో గరిష్ట ప్రయోజనం అందించేలా రూపొందించ బడ్డాయి. ఇవి ప్రత్యేకించి నిరుపేదలకు, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారికి, గ్రామీణ జనాభాకు అండగా నిలుస్తున్నాయి.

ఇన్నాళ్లూ సంప్రదాయ పద్ధతుల్లో కొనుగోలు చేసిన బీమా ఇప్పుడు తంత్ర జ్ఞాన ఆధారిత రూపాన్ని సంతరించుకుంది. ఆధార్ ఆధారిత ధృవీకరణతో, చేతి ఫోనులో నుంచే పాలసీలు కొనుగోలు చేయడం, నష్టపరిహారం పొందడం సులభమైంది. పాలసీ బజార్, డిజిట్, ఆకో వంటి మాధ్యమాల ద్వారా బీమా తీసుకోవడం ఎంతో వేగవంతమైన ప్రక్రియగా మారింది. ఇవి కొత్త తరానికి వినూత్నమైన అవకాశం. బీమా ఉండటం ఎంత ముఖ్యమో, దానిని సక్రమంగా ఉపయోగించు కోవడమూ అంతే ముఖ్యం. పాలసీ నిబంధనలు పూర్తిగా చదవడం, అవసరమైన ఆధారాలు సమకూర్చు కోవడం, ప్రమాదం జరిగిన వెంటనే సంస్థకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలు ప్రతీ పాలసీ దారుడికి తెలియాలి. అప్పుడే నష్ట పరిహారం పొందే ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిగా ప్రయోజనం పొందవచ్చు.

ఈ నేషనల్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్ డే మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది -- బీమా ఉండటం అనేది శుభ సూచకం. అది భయానికి కాదు, భరోసాకు సంకేతం. అది వ్యయానికి కాదు, సంక్షేమానికి సూచిక. మన జీవితంలో ఒక్క అవకాశం తప్పితే జీవితం మారిపోతుంది. అలాంటి సంధిలో బీమా మన కుటుంబానికి నమ్మకమైన నీడలాంటిది. ఈరోజు మనకు ఆదర్శనంగా ఉండాలి. మన కుటుంబం భవిష్యత్తు కోసం, మన పిల్లల భద్రత కోసం, అనుకోని సంఘటనల్లో ఆర్థిక పరంగా వెనుక పడకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం మంచి నిర్ణయం. ప్రతి ఒక్కరూ కనీసం ఒక జీవ బీమా లేదా ఆరోగ్య బీమా పాలసీతో తమ భవిష్యత్తును భద్ర పర్చుకోవాలి. అదే నిజమైన తెలివైన నిర్ణయం.

**బీమా లేదు అంటే భద్రతా లేదు. బీమా ఉన్న చోటే భరోసా ఉంటుంది. కనుక ఈరోజే బీమా గురించి తెలుసుకోండి. మీ అవసరానికి తగిన పాలసీ ఎంచుకోండి. మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని సురక్షితంగా, సంతోషంగా గడపండి.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 'తొలి హైందవ సామ్రాజ్య నిర్మాత శివాజీ'

## జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి...

## హిందూ సామ్రాజ్య దినం

భారత పుణ్యభూమిలో ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా జీవించిన మహనీయులలో ఛత్రపతి శివాజీ నిత్య స్మరణీయుడు. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సర జ్యేష్ఠ శుక్ల త్రయోదశి (1674 జూన్ 6) నాడు శివాజీ సింహాసనాన్ని అధిష్టించి, తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. 1307లో యాదవ సామ్రాజ్య పతనం తర్వాత సుమారు 350 ఏళ్ల వరకు మరే హిందూ సామ్రాజ్యమూ లేని చీకటి రోజుల్లో, మృతప్రాయమైన హిందుత్వంలో నూతనోత్తేజం నింపి స్వరాజ్యాన్ని స్థాపించిన చారిత్రాత్మక సందర్భం ఇది. అందుకే ప్రతి ఏటా ఈ పవిత్ర తిథిని "హిందూ సామ్రాజ్య దినం"గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.



శివాజీ పూనా జాళర్దారు అయిన శహాజీ, జిజియాబాయి దంపతులకు 1630 ఫిబ్రవరి 19న జన్మించాడు. ముస్లిం సుల్తానుల పాలనలో జరుగుతున్న దేవాలయాల ధ్వంసాలు, గోవధలు, మారణకాండలను చూసి చిన్నతనం నుంచే జిజియాబాయిలో తీవ్ర జుగుప్స రేగింది. ఆమె తన తండ్రి, సోదరులను నిజాం షాహీ దారుణంగా హత్య చేసిన ఉదంతాలను తట్టుకుంటూ, కుమారుడైన శివాజీకి రామాయణ, భారత గాథలను ఉగ్గుపాలతో రంగరించి దేశభక్తిని నూరిపోసింది. తండ్రి శహాజీ నియమించిన పండితుడు, పాలనాదక్షుడైన దాదాజీ కొండదేవ్ పర్యవేక్షణలో శివాజీ సర్వవిద్యలు, ఆయుధ శిక్షణలు పొంది వీరుడిగా తీర్చిదిద్దబడ్డాడు. తురుష్కుల చేతిలో ఉజ్వల విజయనగర సామ్రాజ్య విధ్వంసాన్ని కళ్లారా చూసిన శివాజీ హృదయంలో స్వరాజ్య కాంక్ష మరింత బలంగా నాటుకుంది. మాతృమూర్తి శిక్షణలో ధర్మ రక్షణే ధ్యేయంగా పెరిగిన శివాజీ, తన 15వ ఏటనే ఒక స్త్రీపై బలాత్కారానికి ఒడిగట్టిన రాంఝూ పటేల్‌ను కఠినంగా శిక్షించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. సుల్తానుల నిర్లక్ష్యానికి గురైన తోరణ దుర్గాన్ని జయించి హిందూ సామ్రాజ్య స్థాపనకు తోరణం కట్టాడు. ఆపై రాజ్‌గఢ్, కువారి, కొండనా, శివరళ, సుభాను మంగళి వంటి దుర్గాలను కేవలం పదహారేళ్ల ముక్కుపచ్చలారని ప్రాయంలోనే వశపరచుకున్నాడు. ఒకదశలో తండ్రి శహాజీని బీజాపూర్ సుల్తాన్ బంధించగా, తల్లి జిజియాబాయి ప్రోత్సాహంతో శివాజీ కొద్ది సైన్యంతోనే ఫతేఖాను భారీ సైన్యాన్ని పురంధర కోట వద్ద భీకర యుద్ధంలో ఓడించి, వ్యూహాత్మకంగా తండ్రిని బంధవిముక్తుడిని చేశాడు.

ఆ తర్వాత రాయగిరి కోటను స్వాధీనం చేసుకుని, దానిని 'రాయగడ దుర్గం'గా మార్చి తన రాజధానిగా చేసుకున్నాడు. కొంకణ, కళ్యాణి, కొల్హాపూర్, పనాలిఘఢ్ వంటి అనేక కోటలను జయించడమే కాక, ఔరంగజేబు సలహాదారులైన షహిస్తఖాన్, జస్వంత్ సింహ వంటి మేటి సర్దార్లను ముప్పతిప్పలు పెట్టి ఓడించాడు. 30 సంవత్సరాల సుదీర్ఘ వీరోచిత పోరాటాల ఫలితంగా 1674 జూన్ 6న రాయగడలో శివాజీకి వైభవంగా పట్టాభిషేకం జరిగింది. రాజుగా బాధ్యతలు చేపట్టాక, పరిపాలనలో అష్ట ప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లు పెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగం సంస్కృతంలోనే సాగాలని 'రాజ్య వ్యవహార కోశాన్ని' రూపొందించాడు. సుమారు 50 ఏళ్ల పాటు అలుపెరగని సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా శరీరం అలసిపోవడంతో, 1680 ఏప్రిల్ 3న ఛత్రపతి శివాజీ తుది శ్వాస విడిచారు. ఆయన చూపిన పరాక్రమం, ధర్మనిష్ఠ తరతరాలకు ఆదర్శనీయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం ధరల్లో యూటర్న్

**హైదరాబాద్, జూన్ 27 :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి షాక్ తగిలింది. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా పసిడి ధరల్లో యూటర్న్ కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం శనివారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,31,950గా ఉంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,950 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే చెన్నైలో బంగారం ధర అత్యధికంగా రూ.1,45,860గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ధరలు దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. ఇటీవలి రోజులలో తగ్గుదల నమోదు చేసిన పసిడి ధరలు మళ్లీ పెరగడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, డాలర్ విలువ మార్పులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.




# డిజిటల్ సేవల పన్నుపై ట్రంప్ సంచలన హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 27 :** గూగుల్, యాపిల్, మెటా, అమెజాన్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజ సంస్థలను లక్ష్యంగా చేసుకుని 'డిజిటల్ సేవల పన్ను' (డిజిటల్ సర్వీసెస్ ట్యాక్స్) విధించాలని చూస్తున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. అటువంటి పన్నును అమలు చేసే ఏ దేశమైనా, ఆ దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 100 శాతం ప్రతీకార సుంకాలు (టారిఫ్స్) విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో కలకలం రేపుతోంది. తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో శుక్రవారం చేసిన సుదీర్ఘ పోస్టులో ట్రంప్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అనేక యూరోపియన్ దేశాలు అమెరికన్ టెక్ కంపెనీలపై డిజిటల్ సేవల పన్ను విధించేందుకు చర్చలు జరుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "అటువంటి పన్ను విధించే ఏ దేశమైనా యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసే తమ వస్తువులన్నింటిపై తక్షణమే 100 శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ట్రంప్ తన పోస్టులో హెచ్చరించారు. డిజిటల్ పన్ను విధించే దేశాలతో ఉన్న వాణిజ్య ఒప్పందాలన్నీ కూడా ఈ చర్యల వల్ల పూర్తిగా ప్రభావితమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్నా, చర్చల దశలో ఉన్నా సరే, ఈ విధానం తక్షణమే వర్తిస్తుందని తెలిపారు. అమెరికన్ టెక్నాలజీ కంపెనీలపై విదేశాల్లో జరుగుతున్న వివక్షను అడ్డుకోవడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకుంటున్నామని ట్రంప్ చెప్పారు. అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే సుంకాలను కీలక ఆయుధంగా ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# పాత నోట్ల వార్తను ఖండించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర



**ముంబై, జూన్ 27 :** 2005కు ముందు ముద్రించిన పాత నోట్లు జూన్ 30 తర్వాత చెల్లవని, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వాటిని స్వీకరించదని సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తలను బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పూర్తిగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, తమ పేరుతో వస్తున్న సమాచారం అవాస్తవమని స్పష్టం చేసింది. పాత మహాత్మా గాంధీ సిరీస్‌కు చెందిన రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు ఇప్పటికీ చట్టబద్ధమైన కరెన్సీయేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే స్పష్టం చేసిందని బ్యాంక్ గుర్తు చేసింది. అలాంటి నోట్లను రద్దు చేస్తున్నట్లు ఎటువంటి అధికారిక ఆదేశాలు లేవని కూడా పేర్కొంది. అవసరమైతే పాత నోట్లను కొత్త నోట్లతో మార్పిడి చేసుకోవచ్చని ఆర్‌బీఐ గతంలోనే తెలిపిందని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వివరించింది. కొత్త నోట్లలో భద్రతా లక్షణాలు పెంచడం ద్వారా నకిలీ నోట్లను నియంత్రించడం మాత్రమే లక్ష్యమని స్పష్టం చేసింది. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎప్పుడూ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సూచించింది.

# పీఎఫ్ డబ్బు ఎప్పుడు పూర్తిగా తీసుకోవచ్చు?

**న్యూఢిల్లీ, జూన్ 27 :** ఉద్యోగుల భవిష్య నిధి పథకం కింద ప్రైవేట్ రంగ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం పెన్షన్, జీవిత బీమా, పొదుపు సొమ్ముపై వడ్డీ వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. ఉద్యోగి, యజమాని ఇద్దరూ సమానంగా చెల్లించే వాటాల ఆధారంగా ఈ నిధి కూడబెట్టబడుతుంది. పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకం అమల్లో ఉంది. ఇటీవల ఈపీఎఫ్‌వో 3.0 గురించి చర్చలు జరుగుతుండటంతో, ఇకపై పీఎఫ్ ఖాతాలోని మొత్తం సొమ్మును ఎప్పుడైనా విత్‌డ్రా చేసుకోవచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగంలో ఉన్నప్పుడు పూర్తి మొత్తాన్ని ఉపసంహరించుకునే అవకాశం లేదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వంద శాతం సొమ్మును తీసుకునే అనుమతి ఉంటుంది. ఉద్యోగి 58 సంవత్సరాలు పూర్తి చేసిన తర్వాత పీఎఫ్ ఖాతాలోని మొత్తం నిధులను తీసుకోవచ్చు. అలాగే ఉద్యోగం మానేసి వరుసగా రెండు నెలల పాటు నిరుద్యోగిగా ఉంటే కూడా మొత్తం సొమ్మును విత్‌డ్రా చేసుకునే హక్కు ఉంటుంది. ఉద్యోగం కోల్పోయిన ఒక నెలలోపు పీఎఫ్ బ్యాలెన్స్‌లో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 25 శాతం మొత్తాన్ని రెండు నెలల నిరుద్యోగ కాలం పూర్తైన తర్వాత తీసుకునే వీలుంటుంది. అదే సమయంలో పాక్షిక ఉపసంహరణకు కూడా ఈపీఎఫ్‌వో అనుమతిస్తుంది. ఉన్నత విద్య, వివాహం, గృహ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ




రుణ చెల్లింపు, వైద్య చికిత్స వంటి అవసరాల కోసం నిర్దిష్ట పరిమితిలో పీఎఫ్ సొమ్మును తీసుకోవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం అత్యవసర అవసరం లేకపోతే పీఎఫ్ మొత్తాన్ని తీసుకోకుండా ఖాతాలోనే ఉంచడం మంచిది. దీంతో భవిష్యత్తులో వడ్డీ రూపంలో మరింత సొమ్ము కూడబెట్టుకోవడంతో పాటు పదవీ విరమణ సమయంలో ఆర్థిక భద్రత కూడా లభిస్తుంది.

# ప్రైమ్ డే సేల్‌కు అమెజాన్ సిద్ధం


**న్యూఢిల్లీ, జూన్ 27 :** భారతదేశంలో అమెజాన్ తన పదో ప్రైమ్ డే సేల్‌ను అధికారికంగా ప్రకటించింది. ప్రైమ్ సభ్యులకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక అమ్మకాల ఉత్సవం జూలై 4 నుంచి జూలై 6 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనుంది. ఈ సందర్భంగా వందకు పైగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఐదు వందలకు పైగా ఉత్పత్తులపై భారీ ధర తగ్గింపులు అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఇతర సాంకేతిక ఉత్పత్తులపై ప్రత్యేక ఆఫర్లు ఉండనున్నాయని తెలిపింది. ఈ సేల్‌లో శాంసంగ్ గెలాక్సీ ఎస్-25 అల్ట్రా స్మార్ట్‌ఫోన్‌పై భారీ ధర తగ్గింపు లభించనుంది.




ప్రస్తుతం సుమారు రూ.1.30 లక్షల ధర ఉన్న ఈ ఫోన్ సేల్‌లో లక్ష రూపాయల లోపే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అమెజాన్ వెల్లడించింది. అలాగే ప్రస్తుతం రూ.82,900 ధర ఉన్న ఐఫోన్-17పై కూడా గణనీయమైన తగ్గింపు ఉంటుందని సంస్థ ధృవీకరించింది. రెడ్‌మి టర్బో-5 స్మార్ట్‌ఫోన్‌పై కూడా సుమారు రూ.20 వేల వరకు తగ్గింపు లభించనున్నట్లు సేల్ వివరాల్లో వెల్లడైంది. దీంతో పాటు వన్‌ప్లస్-13, వన్‌ప్లస్-15ఆర్, ఐఫోన్-17 ప్రో మ్యాక్స్, ఐక్యూఓఓ-15, శాంసంగ్ జెడ్ ఫోల్డ్-7 వంటి ప్రీమియం స్మార్ట్‌ఫోన్లపై కూడా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. మధ్యస్థాయి, తక్కువ ధరల విభాగానికి చెందిన పలు మొబైల్ ఫోన్లపై కూడా ఆకర్షణీయమైన తగ్గింపులు ఇవ్వనున్నట్లు సంస్థ పేర్కొంది. అమెజాన్ ప్రైమ్ డే సేల్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ కూడా తన ప్రత్యేక అమ్మకాల ఉత్సవాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. దీంతో వినియోగదారులకు రెండు ప్రముఖ ఈ-వాణిజ్య వేదికల్లోనూ భారీ ధర తగ్గింపులతో వస్తువులు కొనుగోలు చేసే అవకాశం లభించనుంది. ప్రైమ్ సభ్యత్వం లేని వినియోగదారుల కోసం కూడా అమెజాన్ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. సాధారణంగా రూ.1,499గా ఉన్న వార్షిక ప్రైమ్ సభ్యత్వాన్ని ప్రస్తుతం రూ.999కే అందిస్తోంది. అలాగే రూ.799 ధర ఉన్న ప్రైమ్ లైట్ సభ్యత్వాన్ని రూ.599కు, రూ.399 విలువైన ప్రైమ్ షాపింగ్ సభ్యత్వాన్ని రూ.299కు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో సేల్ ప్రారంభానికి ముందే తక్కువ ధరకు సభ్యత్వం పొందే అవకాశం వినియోగదారులకు కల్పించింది.

# అదానీ లంచం కేసులో అమెరికా కోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 27 :** భారతీయ వ్యాపార దిగ్గజం గౌతమ్ అదానీపై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతో పాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేయాలన్న అభ్యర్థనను అమెరికా ఫెడరల్ జడ్జి తిరస్కరించారు. బ్రూక్లిన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ కేసుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అమెరికా న్యాయ శాఖ భావిస్తోందో స్పష్టమైన, పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. జులై 13 లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. గతంలో మే 18న దాఖలైన పిటిషన్ చాలా సంక్షిప్తంగా ఉందని, దానిలో సరైన కారణాలు లేవని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసును డ్రాప్ చేయాలనే నిర్ణయానికి వెనుక ఉన్న ఆధారాలు, చట్టపరమైన కారణాలను పూర్తిగా వివరించాలని ఆయన సూచించారు. ఈ కేసు 2024లో నమోదు కాగా, భారత్‌లోని భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారన్న అభియోగాలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ ఖండిస్తోంది. ఇటీవల అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా పరిధిలోకి రాదని, తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే తుది నిర్ణయానికి ముందు పూర్తి వివరణ అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఈ కేసుతో సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీ కరించింది. గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ నిర్దిష్ట మొత్తంలో సెటిల్‌మెంట్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఇతర నియంత్రణ సంబంధిత అంశాలపై కూడా చెల్లింపులకు అంగీ కారం తెలిపినట్లు తెలుస్తోంది.





# ఫోక్స్‌వ్యాగన్ భారీ లేఆఫ్స్‌కు సిద్ధం

హైదరాబాద్, జూన్ 27 : ప్రపంచ ఆటోమొబైల్ రంగాన్ని గ్లోబల్ లేఆఫ్స్ తీవ్రంగా కుదిపేస్తున్నాయి. ప్రముఖ ఐరోపా కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ భారీ ఉద్యోగ కోతలకు సిద్ధమవుతోందన్న వార్త కార్పొరేట్ ప్రపంచంలో కలకలం రేపుతోంది. మొదట జర్మనీలో సుమారు 50 వేల మంది ఉద్యోగులను తగ్గిస్తామని ప్రకటించిన ఈ సంస్థ, తాజా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్యను ఏకంగా లక్షకు పెంచినట్లు సమాచారం. ఖర్చులను తగ్గించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభావం కేవలం ఫోక్స్‌వ్యాగన్‌కే పరిమితం కాకుండా దాని అనుబంధ లగ్జరీ బ్రాండ్ ఆడీపై కూడా పడింది. వ్యయ నియంత్రణలో భాగంగా జర్మనీలోని మూడు ఫోక్స్‌వ్యాగన్ ప్లాంట్లతో పాటు ఒక ఆడీ ఫ్యాక్టరీని కూడా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించినట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్లలో మారుతున్న పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా విధిస్తున్న సుంకాలు (టారిఫ్స్), అలాగే చైనాకు చెందిన తక్కువ ధరల ఎలక్ట్రిక్ వాహనాల నుండి వస్తున్న తీవ్రమైన పోటీ ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ ఒక కీలక వ్యూహాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గ్రూప్ నుండి బ్రాండ్‌ను వేరుగా చేసి స్వతంత్ర సంస్థగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో పెద్ద మార్పులకు సంకేతంగా మారాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్‌లో యాపిల్ ఉత్పత్తులకు భారీ ధరల పెంపు


**హైదరాబాద్, జూన్ 27 :** భారతీయ యాపిల్ (ఆపిల్) ప్రేమికులకు మరియు ప్రొఫెషనల్ వినియోగదారులకు ఇది నిజంగా ఊహించని షాక్‌గా మారింది. ఎంతోకాలంగా ఆకాంక్షించే మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌లతో పాటు మ్యాక్ స్టూడియో, మ్యాక్ మినీ, హోమ్‌పాడ్, యాపిల్ టీవీ వంటి పలు ఉత్పత్తుల ధరలను యాపిల్ సంస్థ భారీగా పెంచేసింది. కొన్ని మోడళ్లపై ఏకంగా రూ.70,000 వరకు ధర పెరగగా, హై-ఎండ్ కాన్ఫిగరేషన్లలో అయితే మొత్తం పెరుగుదల దాదాపు లక్ష రూపాయల వరకు చేరినట్లు తెలుస్తోంది. ఈ పెంపుతో ప్రొఫెషనల్ వినియోగదారులపై ఎక్కువ ఆర్థిక భారం పడనుంది. ఈ ధరల పెంపునకు ప్రధాన కారణంగా గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులనే నిపుణులు చెబుతున్నారు. ఓపెన్‌ఏఐ, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు భారీ స్థాయిలో డేటా సెంటర్ల కోసం హై-బ్యాండ్‌విడ్త్ మెమరీ, డీఆర్‌ఏఎమ్, ఎన్‌ఏఎన్‌డీ ఫ్లాష్ స్టోరేజ్ చిప్‌లను భారీగా కొనుగోలు చేయడంతో వాటి ధరలు పెరిగాయని అంటున్నారు. దీనిపై యాపిల్ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఏఐ డేటా సెంటర్ల వేగవంతమైన విస్తరణ వల్ల మెమరీ, స్టోరేజ్ భాగాల ధరలు చాలా వేగంగా పెరిగాయి. ఇప్పటివరకు ఈ భారాన్ని వినియోగదారులపై వేయకుండా మేమే భరించాం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెంచక తప్పలేదు" అని పేర్కొన్నారు. అలాగే ఆధునిక పరికరాల్లో ఆన్-డివైజ్ ఏఐ ఫీచర్ల కోసం అధిక ర్యామ్, వేగవంతమైన ప్రాసెసర్లు అవసరమవుతున్నందున తయారీ వ్యయం కూడా నిర్మాణాత్మకంగా పెరిగిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ ధరల పెంపు ప్రధానంగా ప్రొఫెషనల్ మ్యాక్‌బుక్ ప్రో, మ్యాక్‌బుక్ ఎయిర్, ఐప్యాడ్‌లపై ఎక్కువ ప్రభావం చూపింది. అయితే భారత్‌లో అసెంబుల్ అయ్యే ఐఫోన్ ధరల్లో మాత్రం ప్రస్తుతం ఎలాంటి మార్పు లేదని సమాచారం. ధరల పెంపుతో యాపిల్ ఉత్పత్తుల డిమాండ్‌పై ఎలా ప్రభావం పడుతుందన్నది టెక్ మార్కెట్‌లో ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది.





# అభిషేక్ అర్ధశతకం ఎందుకు రద్దైంది?

**డబ్లిన్, జూన్ 27 :** ఐర్లాండ్‌తో జరిగిన తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌లో భారత జట్టు ఓటమిపాలైనప్పటికీ, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వరుసగా వికెట్లు పడుతున్న సమయంలోనూ ధాటిగా ఆడిన అతడు కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసినట్లు మొదట స్కోరు బోర్డులో నమోదైంది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా అభినందనలు తెలియజేస్తూ సందేశాన్ని విడుదల చేసింది. అభిషేక్ కూడా తన అర్ధశతకాన్ని ఆనందంగా జరుపుకున్నాడు. అయితే కొద్దిసేపటికే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏడో ఓవర్ చివరి బంతికి అభిషేక్ శర్మ ఔటైన అనంతరం స్కోరు బోర్డును సవరించారు. మొదట అతడి ఖాతాలో నమోదు చేసిన అర్ధశతకాన్ని రద్దు చేసి, వ్యక్తిగత స్కోరును 20 బంతుల్లో 49 పరుగులుగా మార్చారు. దీంతో అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. దీనికి కారణం భారత ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో నమోదైన ఒక పరుగు. మొదట ఆ పరుగును అభిషేక్ ఖాతాలో సింగిల్‌గా నమోదు చేశారు. అయితే అనంతరం మ్యాచ్ అధికారుల సమీక్షలో అది బ్యాట్‌కు కాకుండా బ్యాటర్ శరీరానికి తగిలి వచ్చిన పరుగుగా తేలింది. దీంతో దానిని బ్యాటర్ పరుగుగా కాకుండా అదనపు పరుగుల విభాగంలో నమోదు చేశారు. ఫలితంగా అభిషేక్ వ్యక్తిగత స్కోరు నుంచి ఒక పరుగు తగ్గిపోయి అర్ధశతకం రద్దైంది. అభిషేక్ ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలింది. ఎనిమిది ఓవర్లలోనే మూడు వికెట్లకు 80 పరుగులు చేసిన జట్టు, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి 148 పరుగులకే ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ బ్యాటర్లు సమష్టిగా రాణించి 34 పరుగుల తేడాతో విజయాన్ని అందుకున్నారు. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఐర్లాండ్ ఆధిక్యంలో నిలిచింది. ఇప్పుడు సిరీస్‌ను సమం చేసుకోవాలంటే చివరి మ్యాచ్‌లో భారత్ తప్పనిసరిగా విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



### అరంగేట్రంలోనే టీమిండియాకు షాకిచ్చిన

# ఐర్లాండ్ బౌలర్..

### ఎవరీ మాథ్యూ హోలార్డ్?

భారత్‌తో జరిగిన తొలి టీ20లో ఐర్లాండ్ యువ బౌలర్ మాథ్యూ హోలార్డ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 27 ఏళ్ల ఈ కుడిచేతి మీడియం-ఫాస్ట్ బౌలర్ భారత టాప్ ఆర్డర్‌ను వరుసగా కుప్పకూల్చి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. తొలి మ్యాచ్‌లోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకోవడం ద్వారా తన కెరీర్‌కు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. బెల్ఫాస్ట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో హోలార్డ్ తన రెండో బంతికే ఇషాన్ కిషన్‌ను పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను తెలివైన వ్యూహంతో ఔట్ చేసి టీమిండియాపై ఒత్తిడి పెంచాడు. మరోవైపు భారత సంతతికి చెందిన అరంగేట్ర బౌలర్ జయ్ ముంద్రా కూడా తన తొలి అంతర్జాతీయ బంతికే సంజూ శాంసన్ వికెట్ తీసి ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరు యువ బౌలర్లు భారత టాప్ ఆర్డర్‌ను కుదిపేయడంతో 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 148 పరుగులకే ఆలౌట్ అయింది.

### 27 ఏళ్ల మాథ్యూ హోలార్డ్ ఎవరు?

1999 ఏప్రిల్ 14న జన్మించిన మాథ్యూ హోలార్డ్ దేశీయ క్రికెట్‌లో కూడా మంచి రికార్డు కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు 15 టీ20 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు, ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు, నాలుగు లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లో 12 వికెట్లు సాధించాడు. లీన్‌స్టర్ లైట్నింగ్, స్ట్రైకర్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించిన హోలార్డ్, భారతపై తన అరంగేట్ర ప్రదర్శనతో ఐర్లాండ్ భవిష్యత్ స్టార్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. అనుభవజ్ఞులైన భారత బ్యాట్స్‌మెన్‌లపై అతను ఆత్మవిశ్వాసంతో బౌలింగ్ చేసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. మూడు కీలక వికెట్లు తీసిన హోలార్డ్, తన అద్భుత ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఇది అతని కెరీర్‌కు అతను కూడా ఊహించని ఆరంభం.

### వరల్డ్‌కప్ స్ట్రీమింగ్ చేస్తున్న

# 400 అక్రమ వెబ్‌సైట్లు సీజ్

**న్యూయార్క్, జూన్ 27 :** ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లను అక్రమంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సుమారు 400 వెబ్‌సైట్లను అమెరికా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాపీరైట్ చట్టాలను ఉల్లంఘిస్తూ మ్యాచ్‌లను అనుమతి లేకుండా ప్రసారం చేస్తున్న ఈ డొమెయిన్లను గుర్తించి చర్యలు తీసుకున్నట్లు అమెరికా న్యాయ శాఖ వెల్లడించింది. ఫిఫా సంస్థతో పాటు పలు దర్యాప్తు సంస్థలు, అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ అక్రమ వెబ్‌సైట్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రముఖ ప్రసార సంస్థలు ఎన్‌బీసీ యూనివర్సల్, వార్నర్ బ్రదర్స్ కూడా ఈ దర్యాప్తులో సహకరించినట్లు వెల్లడించారు. అక్రమ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అధికారిక ప్రసార హక్కులు కలిగిన సంస్థలకు భారీ ఆర్థిక నష్టం కలిగించడమే ఈ వెబ్‌సైట్ల ప్రధాన ఉద్దేశమని అమెరికా న్యాయ శాఖ పేర్కొంది. ఈ వెబ్‌సైట్లు కాపీరైట్ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించినట్లు కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో వాటిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ కంప్యూటర్ హ్యాకింగ్, మేధోసంపత్తి పరిరక్షణ విభాగంలో శిక్షణ పొందిన అధికారులు పలు దేశాల్లో దర్యాప్తు చేపట్టి అక్రమ ప్రసార సర్వర్లు, డొమెయిన్లను గుర్తించారు. ముఖ్యంగా పెరూ, బల్గేరియాలో ఈ సర్వర్లు, డొమెయిన్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడి కేంద్రాలపై ప్రత్యేక నిఘా



పెట్టారు. అలాగే క్రొయేషియా, రొమేనియా, పోలాండ్, కొలంబియా దేశాల్లో కూడా అక్రమ ప్రసారాలకు సంబంధించి పనిచేస్తున్న హ్యాకింగ్ కేంద్రాలను గుర్తించినట్లు అమెరికా న్యాయ శాఖ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ పైరసీని అరికట్టేందుకు అంతర్జాతీయ స్థాయిలో చర్యలు మరింత వేగవంతం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# వ్యాపార రంగంలోకి జొకోవిచ్

**లండన్, జూన్ 27 :** ప్రపంచ టెన్నిస్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్టార్ క్రీడాకారుడు నొవాక్ జొకోవిచ్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ అంతర్జాతీయ ప్రైవేట్ పెట్టుబడి సంస్థ జనరల్ అట్లాంటిక్‌కు ప్రపంచ వ్యూహాత్మక సలహాదారుగా ఆయనను నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త బాధ్యతల్లో భాగంగా జొకోవిచ్ సంస్థ ఉన్నతాధికారులు, అనుబంధ సంస్థలు, పెట్టుబడిదారులతో కలిసి పనిచేయనున్నారు. నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, సరికొత్త ఆలోచనలపై తన అనుభవాలను పంచుకోనున్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, శ్రేయస్సు రంగాల్లో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు జొకోవిచ్ అనుభవం, ప్రపంచవ్యాప్త పరిచయాలు ఉపయోగపడతాయని సంస్థ భావిస్తోంది. ఇటీవలి కాలంలో జొకోవిచ్ వ్యాపార రంగంలో కూడా తన పెట్టుబడులను విస్తరిస్తున్నారు. ఆరోగ్య ఉత్పత్తులు, పోషకాహార పదార్థాలు, ఆహార ఉత్పత్తులు, ధరించగలిగే సాంకేతిక పరికరాల రంగాల్లో పలు సంస్థలకు పెట్టుబడులు పెట్టడంతో పాటు కొత్త సంస్థలను కూడా ప్రారంభించారు. ఈ నియామకంపై స్పందించిన జొకోవిచ్, క్రీడల్లో విజయం సాధించేందుకు అవసరమైన క్రమశిక్షణ, దీర్ఘకాలిక ఆలోచన, నిరంతరం మెరుగుపడాలనే తపనే వ్యాపార విజయానికి కూడా మూలమని పేర్కొన్నారు. అలాంటి విలువలతో ముందుకు సాగుతున్న ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పదిహేనేళ్ల వయసులోనే వృత్తిపరమైన టెన్నిస్‌లో అడుగుపెట్టిన జొకోవిచ్ తన కెరీర్‌లో రికార్డు స్థాయిలో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలుచుకున్నారు. ఒలింపిక్ స్వర్ణ పతకం, ప్రపంచ నంబర్-1 స్థానంలో అత్యధిక వారాలు కొనసాగిన ఘనత, ఎనిమిది సార్లు ఏడాది ముగింపు నంబర్-1 ర్యాంకు, నలభై మాస్టర్స్ వెయ్యి టైటిళ్ల వంటి ఎన్నో అరుదైన విజయాలతో టెన్నిస్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇప్పుడు క్రీడల్లో సంపాదించిన అనుభవాన్ని వ్యాపార రంగంలోనూ వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు.



### ప్రపంచకప్‌లో కాబో వెర్డె చరిత్ర..

# నాకౌట్‌కు అర్హత

**న్యూయార్క్, జూన్ 27 :** ప్రపంచకప్-2026లో చిన్న దేశం కాబో వెర్డె చరిత్ర సృష్టించింది. ఆఫ్రికా ఖండంలోని అతి చిన్న దేశాల్లో ఒకటైన ఈ దేశం, కేవలం సుమారు ఐదు లక్షల ముప్పై వేల జనాభాతోనే ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరి ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. తొలి సారిగా ప్రపంచకప్‌లో పాల్గొన్న కాబో వెర్డె, గ్రూప్ దశను దాటి ముందంజ వేసిన జట్టుగా అరుదైన ఘనత సాధించింది. 2010లో స్లోవేకియా తర్వాత తొలి ప్రపంచకప్‌లోనే గ్రూప్ దశను అధిగమించిన తొలి జట్టుగా నిలిచింది. అలాగే 2006లో ఘనా తర్వాత నాకౌట్‌కు చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా కూడా గుర్తింపు పొందింది. గ్రూప్-హెచ్‌లో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియాలతో కలిసి బరిలోకి దిగిన కాబో వెర్డె, మూడు మ్యాచ్‌ల్లోనూ డ్రా ఫలితాలు నమోదు చేసింది. ఒక్క విజయమూ సాధించకపోయినా మూడు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రౌండ్-32కు అర్హత సాధించింది. స్పెయిన్ రెండు విజయాలు, ఒక డ్రాతో అగ్రస్థానంలో నిలిచి తదుపరి దశకు చేరుకుంది. నాకౌట్ దశలో జులై 3న కాబో వెర్డె బలమైన అర్జెంటీనాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఫుట్‌బాల్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిన్న దేశమైన కాబో వెర్డె మరో సంచలనం సృష్టిస్తుందా అనే చర్చ కొనసాగుతోంది. ఇక గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో ఉరుగ్వే ఒకటి--సున్నా తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఉరుగ్వేతో పాటు సౌదీ అరేబియా టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మరోవైపు గ్రూప్-ఐలో ఫ్రాన్స్ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసిన ఫ్రాన్స్ నాలుగు-ఒకటి తేడాతో నార్వేపై విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరుకుంది. అదే గ్రూప్‌లో సెనెగల్ ఐదు-సున్నా తేడాతో ఇరాక్‌ను చిత్తు చేసింది. దీంతో ఫ్రాన్స్, నార్వే, సెనెగల్ జట్లు తదుపరి దశకు అర్హత సాధించాయి.





# అమెరికాతో థ్రిల్లర్..

### ఆఖరి నిమిషంలో నెగ్గిన టర్కీ

**లాస్ ఏంజిల్స్:** ఫిఫా వరల్డ్‌కప్ లో టర్కీ తొలి విజయాన్ని నమోదు చేసింది. వాస్తవానికి టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన ఆ జట్టు .. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో హోస్ట్ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో నెగ్గింది. గ్రూప్ డీ మ్యాచ్‌లో మొత్తం అయిదు గోల్స్ నమోదు అయ్యాయి. ఈ మ్యాచ్‌లో అమెరికా ఓడినా.. ఆ గ్రూపులో మాత్రం ఆ దేశమే అగ్రస్థానంలో ఉన్నది. ఆట ప్రారంభమైన మూడు నిమిషాలకే అమెరికా ప్లేయర్ ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టాడు. డీప్ కార్నర్ నుంచి సెబాస్టియన్ అందించిన పాస్‌ను లెఫ్ట్ ఫూట్‌తో ట్రస్టీ గోల్‌గా మలిచాడు. టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినా.. అమెరికాతో మ్యాచ్‌లో మాత్రం టర్కీ పట్టుదలతో ఆడింది. ఇక టర్కీ ప్లేయర్ గులేర్ 10వ నిమిషంలో ఆ జట్టుకు తొలి గోల్ అందించాడు. అరగంట ఆట ముగిశాక.. టర్కీ ప్లేయర్ బారిస్ యిల్మాజ్ మరో గోల్ చేశ్నాడు. దీంతో టర్కీ లీడింగ్‌లోకి వెళ్లింది. రెండో హాఫ్ 49వ నిమిషంలో అమెరికా ప్లేయర్ బెర్‌హాల్టర్ గోల్ చేసి ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపాడు. దాదాపు ఆట ముగిసే సమయం వరకు రెండు జట్లు 2-2 గోల్స్ తేడాతో సమంగా పోరాడాయి. కానీ 98వ నిమిషంలో టర్కీ ప్లేయర్ అందర్నీ స్టన్ చేశాడు. కాన్ అయాన్ గోల్ చేయడంతో కీలకమైన మూడు పాయింట్లు టర్కీ ఖాతాలోకి వెళ్లాయి. అమెరికా జట్టు ఈ టోర్నీలో చరిత్ర సృష్టిస్తోంది. ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఈవెంట్‌లో ఇప్పటికే 8 గోల్స్ చేసింది. గతంలో 1930, 2002లో అత్యధికంగా ఏడు గోల్స్ మాత్రమే చేసింది.

చురకలు





## సోషల్ మీడియా సెన్సేషన్‌గా దీప్తి సునయన

సోషల్ మీడియా ప్రభావంతో కొత్త తరం సెలబ్రిటీలు వేగంగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి సోషల్ మీడియా సెన్సేషన్ దీప్తి సునయన పేరు నెట్టింట వైరల్‌గా మారింది. ఒక్క సినిమా కూడా చేయకుండానే భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, కుర్రాళ్లలో ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకుంది. డబ్‌స్మాష్ వీడియోలతో మొదలైన దీప్తి సునయన ప్రయాణం, తర్వాత టిక్‌టాక్ వీడియోలు, యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్స్ వరకు విస్తరించి ఆమెను సోషల్ మీడియా స్టార్‌గా మార్చింది. ఆమె చేసిన ప్రతి పోస్ట్‌కు వేలల్లో లైక్స్, కామెంట్స్ వస్తుండటంతో ఆమెకు ఉన్న పాపులారిటీ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. తరువాత బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన దీప్తి సునయన, ఆ షో తర్వాత కూడా షార్ట్ ఫిల్మ్స్, కవర్ సాంగ్స్ చేస్తూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కొనసాగుతోంది. సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశాలు వస్తాయని అభిమానులు భావించినప్పటికీ, ప్రస్తుతం ఆమె పూర్తిగా సోషల్ మీడియా కంటెంట్‌పైనే దృష్టి పెట్టింది. చీరకట్టులోనూ, మోడ్రన్ లుక్‌లోనూ తన అందచందాలతో ఆకట్టుకుంటూ యువతను మంత్రముగ్ధులను చేస్తున్న దీప్తి సునయన, సోషల్ మీడియా వేదికగా తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతూ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చాయి.



## వృషకర్మతో నాగ చైతన్య కొత్త ప్రయాణం

### ఇప్పటికీ ఆమెతోనే బెస్ట్ కెమిస్ట్రీ..!

అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య వరుస విజయాలతో మంచి ఫామ్‌లో కొనసాగుతున్నారు. కంటెంట్ ప్రధానంగా ఉన్న సినిమాలను ఎంచుకుంటూ హిట్స్ అందుకుంటున్న ఆయన, చివరిగా విడుదలైన 'తండేల్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం నాగ చైతన్య పీరియాడికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు 'వృషకర్మ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. జెట్ స్పీడ్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, నాగ చైతన్య గతంలో చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో నటించిన హీరోయిన్లలో ఎవరి కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని అడిగిన ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేసింది. దాదాపు 27 సినిమాల్లో, 20కి పైగా హీరోయిన్లతో నటించిన నాగ చైతన్య, ఎలాంటి తడబాటు లేకుండా హీరోయిన్ కృతిశెట్టితో కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్య ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నాగ చైతన్య సాయి పల్లవి, సమంత, తమన్నా, రాశి ఖన్నా వంటి స్టార్ హీరోయిన్లతో కలిసి నటించినప్పటికీ కృతిశెట్టి పేరు చెప్పడం విశేషంగా మారింది. కృతిశెట్టితో ఆయన 'బంగార్రాజు', 'కస్టడీ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.




## ఇరుముడి కట్టు పాట 29న విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.

## సినిమా కంటే చదువుపై ఆసక్తి ఎక్కువ: పూనమ్

తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి పూనమ్ కౌర్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాను సినిమాల్లోకి అనుకోకుండా వచ్చానని, అసలు తన లక్ష్యం వేరే రంగమని ఆమె వెల్లడించారు. చిన్నప్పటి నుంచే సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయిందని పూనమ్ కౌర్ తెలిపారు. తన తల్లి పడిన కష్టాలను చూసి, ప్రభావవంతమైన లాయర్‌గా మారాలని కలలు కన్నానని ఆమె పేర్కొన్నారు. కపిల్ సిబల్, రామ్ జెఠ్మలానీ వంటి ప్రముఖ లాయర్లలా ఎదగాలనేది తన లక్ష్యమని చెప్పారు. ఒక సందర్భంలో తాము నివసించిన భవనం తమ తండ్రిదని, ఆయన మరణానంతరం ఆస్తి కోసం తన తల్లి ఏడేళ్ల పాటు పోరాడాల్సి వచ్చిందని పూనమ్ గుర్తుచేసుకున్నారు. ఈ అనుభవాలే తనను న్యాయ రంగం వైపు ప్రేరేపించాయని తెలిపారు. నిఫ్ట్, నాల్సార్ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ప్రవేశ పరీక్షలు కూడా రాశానని, నాల్సార్‌లో అవకాశం వచ్చి ఉంటే తాను సినిమాల వైపు వచ్చేదాన్ని కాదని స్పష్టం చేశారు. నటనను తాను కేవలం ఒక పార్ట్‌టైమ్ ఉద్యోగంలా మాత్రమే చూశానని ఆమె వ్యాఖ్యానించారు. బాలీవుడ్‌లో తన ప్రారంభ అనుభవాలను పంచుకుంటూ, ఒక పెద్ద ఖాన్ కుటుంబానికి చెందిన వ్యక్తి నిర్మించిన సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చినప్పటికీ షూటింగ్ సమయంలో అనేక అవమానాలు ఎదురయ్యాయని తెలిపారు. తన సన్నివేశాలను కావాలనే తగ్గించడం, మేకప్‌లో మార్పులు చేయడం, ఒక ప్రత్యేక నటికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయని ఆమె ఆరోపించారు. ఈ కారణంగా పది రోజుల షూటింగ్ అనంతరం ఆ ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చానని పూనమ్ కౌర్ పేర్కొన్నారు. అప్పటి పరిస్థితులపై నిర్మాతకు నేరుగా ఫోన్ చేసి, దర్శకుడి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కూడా ఆమె తెలిపారు. చివరగా సినిమాల కంటే చదువు, పరిశోధనపై తనకు ఎక్కువ ఆసక్తి ఉందని, ఐక్యరాజ్యసమితిలో పని చేయాలనేది తన అసలు



## రాకాలో పవర్‌ఫుల్ రోల్‌లో రష్మిక

### నెగెటివ్ షేడ్‌లో ఉంటుందని ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన అల్లు అర్జున్, రష్మిక మందన్న హిట్ కాంబో ఈ సినిమాతో మరోసారి రిపీట్ కాబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి వీరిద్దరి కాంబినేషన్ మరింత విభిన్నంగా ఉండబోతోందని సమాచారం. ఇప్పటివరకు బన్నీతో కేవలం రొమాన్స్ చేసిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్తగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందని ప్రచారం సాగుతోంది. కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక కీలకమైన పాత్ర కోసం దర్శకుడు అట్లీ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైలో జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్‌లో రష్మిక కూడా జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పుష్ప' సిరీస్ బ్లాక్‌బస్టర్ హిట్ అవ్వడంతో అల్లు అర్జున్‌కి రష్మిక ఒక 'లక్కీ చార్మ్' అని, అందుకే ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రధాన నాయికగా నటిస్తుండగా, రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో మెరవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రేజీ తారాగణంతో అంచనాలను పెంచేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్ర యూనిట్ నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com